www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్


మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 62 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com బుధవారం 17 - 06 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool





తెలంగాణకు అలర్ట్... జూన్ 19 నుంచి భారీ వర్షాలు

## సెమీకండక్టర్ల తయారీకి

# ఏపీ బెస్ట్ డెస్టినేషన్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 30 రోజుల్లో ఏపీకి వచ్చి చూడాలంటూ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఏపీ అత్యుత్తమ ప్రాధాన్యమిస్తున్నామన్న చంద్రబాబు
- రాయలసీమలో త్వరలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు
- సింగపూర్‌లోని సెమీకాన్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి



**అమరావతి :**

ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో రెండో రోజు పర్యటనలో భాగంగా సెమీ కండక్టర్లపై 'సెమీకాన్ ఎకోసిస్టమ్ సదస్సు'కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమీకండక్టర్ల తయారీకి ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ గమ్యస్థానమని స్పష్టం చేశారు. 30 రోజుల్లో ఏపీకి వచ్చి అమల్లో ఉన్న పాలసీలను పరిశీలించాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. సింగపూర్‌లో సెమీకాన్ రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు భారత్ అత్యంత సురక్షితమైన ప్రాంతమని, అందులో ఆంధ్రప్రదేశ్ అనుకూలమైన రాష్ట్రమని, పెట్టుబడులకు ఇది సరైన సమయమని సీఎం వ్యాఖ్యానించారు. సెమీకండక్టర్ల తయారీకి ఏపీలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. రాయలసీమలో త్వరలోనే ఓ సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు - మిగతా 2 లో

# జులై మూడో వారంలో 'తల్లికి వందనం'

- విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష
- వచ్చే నెలలో 'తల్లికి వందనం' పథకం అమలుకు చర్యలు
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని మంత్రి లోకేష్ ఆదేశం
- జూన్ 29న షైనింగ్ స్టార్స్, జులైలో మెగా పీటీఎం నిర్వహణకు నిర్ణయం
- వివిధ 'సెట్'లను సకాలంలో నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖకు సూచన
- ఏపీకి ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు



**అమరావతి :**

రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో - మిగతా 2 లో




## దేశ రాజధాని ఢిల్లీలో

# భారీగా పెరిగి జనాభా

- సెన్సస్ తొలిదశ గణాంకాలు వెల్లడి
- సెన్సస్ 2027 తొలి దశలో 2.3 కోట్లు దాటిన ఢిల్లీ జనాభా
- 2011తో పోలిస్తే 15 ఏళ్లలో 37.5 శాతం వృద్ధి నమోదు
- ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల మంది జనాభా
- ఇవి ప్రాథమిక గణాంకాలేనని, తుది నివేదిక 2027లో వస్తుందని వెల్లడి




## ట్రంప్‌తో చర్చల కోసం

# ఇరాన్ వినూత్న వ్యూహం

- ట్రంప్‌తో శాంతి చర్చల కోసం సైకాలజిస్టులను నియమించిన ఇరాన్
- ట్రంప్ మానసిక ప్రవర్తనను అంచనా వేయడమే లక్ష్యం
- నాలుగు నెలల చర్చల తర్వాత ఇరు దేశాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం
- స్విట్జర్లాండ్‌లో జరగనున్న ఒప్పందంపై సంతకాల కార్యక్రమం

## 'దిశ' ఫెయిల్

# 'శక్తి' సక్సెస్

- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత
- ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత
- గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ
- ఇప్పటి వరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడి



**అమరావతి :**

ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వ పోలీసింగ్ తీరుపై ఆమె పూర్తి స్థాయి - మిగతా 2 లో

# గూగుల్ ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్ అవుట్!

- నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో భారత్‌లో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం
- జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా యాప్‌ను బ్లాక్ చేసిన కేంద్ర ప్రభుత్వం
- గూగుల్ ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్‌ను తొలగించాలని ఆదేశాలు
- చీటింగ్ నెట్‌వర్క్‌లను అరికట్టేందుకు ఎన్టీఏ సిఫార్సు మేరకు ఈ చర్యలు
- జూన్ 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా నిలిపివేయాలని ఆదేశం




**ఢిల్లీ :**

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై భారత్‌లో తాత్కాలిక నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా ఈ యాప్ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేసింది. పరీక్షల్లో అక్రమాలు, తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సిఫార్సుల మేరకు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000, సెక్షన్ 69ఏ కింద ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఆదేశాల ఫలితంగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి - మిగతా 2 లో

## రేవంత్ అన్నదమ్ములే

# కోటీశ్వరులయ్యారు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్!
- పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్
- గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం జరిగిందన్న హరీశ్
- తమ శాఖల్లో ఏం జరుగుతోందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా
- పిల్లలకు ఇచ్చే గుడ్లు,పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా అని మండిపాటు



**హైదరాబాద్ :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన - మిగతా 2 లో

## కాంగ్రెస్ వైఖరిపై

# బండి సంజయ్ నిప్పులు



- తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు ఇచ్చామని వెల్లడి
- తెలంగాణ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న బండి సంజయ్
- అక్రమ వలసదారుల ఓట్లపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్న
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని వ్యాఖ్య

**హైదరాబాద్ :**

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కేంద్ర మంత్రి - మిగతా 2 లో



# ఓటరు జాబితా సవరణ

- బూత్ లెవల్ క్యాడర్ కు మంత్రి సీతక్క దిశానిర్దేశం
- బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారన్న సీతక్క
- ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని సూచన
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపు

**హైదరాబాద్ :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తెలంగాణ మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి - మిగతా 2 లో

## హైదరాబాద్ మెట్రోపై

# మాకు వివక్ష లేదు

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సమంజసం కాదు
- రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని వెల్లడి
- కేంద్రానికి రేవంత్, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా




**హైదరాబాద్ :**

గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకారమవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.తెలంగాణ కావున, కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని, అనాలోచితంగా, దుందుడుకుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని హితవు కిషన్ రెడ్డి పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తాము రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు - మిగతా 2 లో

# సంపాదకీయం

## యుద్ధం మధ్యలో వాలిన 'పెట్టుబడి' రాబందులు!

మార్క్సిస్ట్ దృష్టికోణంలో యుద్ధం అనేది అనుకోకుండా అకస్మాత్తుగా జరిగేది కాదు. పెట్టుబడిదారీ విధానం విస్తరణలో అది ఒక దశ. మార్కెట్లు స్తంభించిపోయినప్పుడు, 'పెట్టుబడి' కొత్త ప్రాంతాలను వెతుక్కుంటుంది. ఆ సందర్భంలో రాజ్యం, కార్పొరేట్ సంస్థలు తమ వర్గ ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తాయి. ప్రజలకు యుద్ధం అంటే మరణం. కానీ, పెట్టుబడికి అది లాభం. రాజ్యానికి అది నియంత్రణ సాధనం. రాజకీయ నాయకులకు అది భవిష్యత్తు అవకాశాలకు మార్గం.ఇప్పటి రోజుల్లో యుద్ధం కేవలం సరిహద్దుల్లోనే కాదు. అది స్టాక్ మార్కెట్లలో, రక్షణ ఒప్పందాల్లో, డేటా సెంటర్లలో, చమురు మార్కెట్లలో, డిజిటల్ ప్లాట్‌ఫాంలలో కూడా జరుగుతుంది. అందుకే యుద్ధం కేవలం విధ్వంసమే కాదు; కొన్ని కార్పొరేట్ సంస్థలకు, కొందరు వ్యక్తులకు అది బంగారు అవకాశాలను తెరిచిపెట్టే ద్వారం! ఒకవైపు ఇరాన్ పైన బాంబులు పడుతూ ఉంటే, మరోవైపు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఆయుధ తయారీ కంపెనీల షేర్లు విపరీతంగా పెరుగుతూ ఉంటాయి. యుద్ధం నుంచి ఎవరు లాభపడుతున్నారనే విషయాన్ని అర్థం చేసుకోకుండా, శాంతి గురించి జరిగే ఎటువంటి చర్చలైనా అసంపూర్తిగానే ఉంటాయి.యుద్ధంలో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారన్న దానికంటే, యుద్ధం వల్ల ఎవరు ధనవంతులు అవుతున్నారన్నది అత్యంత కీలకం. యుద్ధం కొందరికి లాభసాటి వ్యాపారం. 'క్షిపణులు' వారికి ఆయుధాలు మాత్రమే కాదు; అవి వారికి ప్రభుత్వ కాంట్రాక్టులు, రాజకీయ ఎదుగుదలకు నిచ్చెనమెట్లు. యుద్ధం ఎంతకాలం కొనసాగితే వారికి అంత లాభం. అందుకే ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో యుద్ధం దౌత్యపరమైన వైఫల్యం కాదు. అది ప్రణాళికాబద్ధమైన, లాభాలను ఆర్జించే ఆర్థిక వ్యవస్థలో భాగం.ఏ యుద్ధం నుంచైనా ఎక్కువ లబ్ధి పొందేవారు-- అధికార కేంద్రాలపై పట్టున్నవారు, ఆ పట్టును యుద్ధకాలంలో తమ ప్రైవేట్ ఆస్తుల పెరుగుదలకు, ఆర్థిక సామ్రాజ్యాల విస్తరణకు ఉపయోగించుకోగలిగినవారు మాత్రమే. దీనికి మంచి ఉదాహరణ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుటుంబం. తండ్రి యుద్ధాన్ని ప్రారంభిస్తాడు, కొడుకులు సొమ్ము చేసుకుంటారు. డోనాల్డ్ ట్రంప్ ఇద్దరు కుమారులు-- డోనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ ఇటీవల బాగా వార్తల్లోకి ఎక్కారు. ఇరాన్‌తో యుద్ధంలో మునిగి ఉన్న గల్ఫ్ దేశాలకు 'డ్రోన్ ఇంటర్‌సెప్టర్'లను విక్రయిస్తున్న ఒక డ్రోన్ తయారీ కంపెనీతో వీరిద్దరికీ సంబంధం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈ డ్రోన్లు ఇరాన్ దాడులను సమర్థంగా ఎదుర్కొంటున్నట్టు చేసే ప్రచారంలో భాగంగా గల్ఫ్ దేశాలలో ఈ కంపెనీ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించింది. ఈ కంపెనీతో ట్రంప్ సోదరులు చేసుకున్న ఒప్పందం వల్ల, కంపెనీలో వాటాలతో సహా వారు భారీగా లాభం పొందారు. యుద్ధం ద్వారా భారీగా లాభం పొందిన అమెరికన్ అధ్యక్షుల కుటుంబాల్లో డోనాల్డ్ ట్రంప్ కుటుంబం మొదటిది అని వైట్‌హౌస్ లాయర్ రిచర్డ్ పెయింటర్ వ్యాఖ్యానించారు.ట్రంప్ కుటుంబం తన వ్యాపార వ్యూహాన్ని కూడా మార్చుకుంది. హోటళ్లు, గోల్ఫ్ కోర్సెస్ మాత్రమే గాక, వారిప్పుడు క్రిప్టో కరెన్సీ, రాకెట్ స్పేర్ పార్టులు, అత్యంత శక్తిమంతమైన విండ్ టర్బైన్లు, రోబోట్లు, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఇరాన్‌పై దాడి ప్రారంభానికి పదకొండు రోజుల ముందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఇజ్రాయెల్‌కు చెందిన డ్రోన్ కంపెనీలో ఎరిక్ ట్రంప్ పెట్టుబడులు పెట్టారు. అమెరికా సైనిక ఖర్చులు, డ్రోన్ల యుద్ధ ఖర్చుల పెంపుదల తదితర విషయాలను ఆ దేశ అధ్యక్షుడైన వారి తండ్రి ట్రంప్ నిర్ణయిస్తూ ఉంటాడు. కుమారుడేమో పెంటగాన్ కాంట్రాక్టులతో కూడిన డ్రోన్ల యుద్ధ కంపెనీలలో పెట్టుబడులు పెడుతుంటాడు. ఎరిక్ ఒక్కరే కాదు, డోనాల్డ్ ట్రంప్ జూనియర్ కూడా మరో డ్రోన్ కంపెనీ సలహామండలిలో చేరారు. ఈ విధంగా, మిలిటరీ టెక్నాలజీ రంగంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బలంగా తిష్ఠ వేశారు.ఆధునిక యుద్ధంలో టెక్నాలజీ కంపెనీల పాత్ర వేగంగా పెరిగింది. ఒకప్పుడు కేవలం సంప్రదాయ రక్షణ సంస్థలకే లాభం వచ్చేది; ఇప్పుడు సిలికాన్ వ్యాలీ కంపెనీలు కూడా ఇందులో ఉన్నాయి. డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంల ద్వారా యుద్ధంలో కీలకపాత్ర పోషిస్తున్న కంపెనీలు భారీగా లాభాలు పొందుతున్నాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత వాటి షేర్ల విలువ కూడా విపరీతంగా పెరిగింది. యుద్ధ ఆర్థిక వ్యవస్థలో టెక్ కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను రక్షణ విభాగాలతో కలిపి ఉపయోగిస్తున్నాయి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఈ రంగంలోకి వెళ్తున్నాయి.యుద్ధం కేవలం కంపెనీలకే కాదు; ప్రభుత్వాలకు కూడా లాభదాయకం. పాలకులు తమ రాజకీయస్థితిని మెరుగుపరచుకోడానికి యుద్ధాన్ని వాడుకుంటారు. దేశీయ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి యుద్ధం ఉపయోగపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.చరిత్రంతా ఇదే జరుగుతోంది. యుద్ధం వల్ల ధనిక దేశాలు మరింత ధనికంగా మారతాయి; పేద దేశాలు మరింత పేదవి అవుతాయి. మరి అసలు ప్రశ్న, ప్రపంచశాంతి? యుద్ధం ఒక వ్యాపారంగా విలసిల్లుతున్నంత కాలం ప్రపంచశాంతి కలగానే మిగిలిపోతుంది.

## 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్

**మొదటిపేజీ తరువాయి -** రిపోర్ట్ కార్డ్‌ను బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 'దిశ' చట్టం అమలు కాలేదని విమర్శిస్తూ.. తమ హయాంలో క్రైం రేట్ గణనీయంగా తగ్గిందని లెక్కలతో సహా వివరించారు.ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందని హోంమంత్రి వెల్లడించారు. సీసీటీవీలు, డ్రోన్ టెక్నాలజీ వాడకం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 70 శాతం పూర్తి చేశామని, నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు.మహిళలపై నేరాల్లో 6.9 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. తాము ఐజీ స్థాయి అధికారితో 'శక్తి యాప్' తెచ్చామని, దీనిని 1.5 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకున్నారని తెలిపారు. లైంగిక నేరాల దర్యాప్తు నాణ్యత 31 శాతం నుంచి ఏకంగా 90 శాతానికి పెరిగిందని, 591 మందికి శిక్షలు పడ్డాయని వివరించారు.'ఈగల్ టీమ్' ద్వారా నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఏపీ మోడల్‌ను తెలంగాణ కూడా అనుసరిస్తుండడం మనకు గర్వకారణమన్నారు. ఇప్పటివరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేసి, 986 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ కోసం ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేస్తున్నామని, రూ. 247 కోట్ల సైబర్ ఫ్రాడ్ మనీని ఫ్రీజ్ చేయడంతో పాటు 8 వేలకు పైగా ఇల్లీగల్ ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించామని స్పష్టం చేశారు.

## గూగుల్ ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్ అవుట్!

**మొదటిపేజీ తరువాయి -** టెలిగ్రామ్ యాప్‌ను తొలగించారు. యాపిల్ యాప్ స్టోర్‌లో కూడా ఈ యాప్‌ను తాత్కాలికంగా అందుబాటులో లేకుండా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనితో పాటు, జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను నిలిపివేయాలని సూచించింది. పాత మెసేజ్‌లను ఎడిట్ చేస్తూ, పేపర్ లీక్ అయినట్లు కృత్రిమ ఆధారాలు సృష్టిస్తున్న ఉదంతాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.మే 2026లో జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు వెల్లువెత్తడంతో జూన్ 21న రీ-ఎగ్జామ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పలు టెలిగ్రామ్ ఛానెళ్లు, గ్రూపుల ద్వారా చీటింగ్ ముఠాలు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఎన్టీఏ గుర్తించింది. కొన్ని ఛానెళ్లను తొలగించినా సమస్య తీవ్రత తగ్గకపోవడంతో, దేశవ్యాప్త నిషేధానికి సిఫార్సు చేయగా, ప్రభుత్వం ఆ మేరకు చర్యలు చేపట్టింది.

## ఓటరు జాబితా సవరణ

**మొదటిపేజీ తరువాయి -** ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తమకు కేటాయించిన హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, క్షేత్రస్థాయిలో ఓటర్లకు అండగా నిలవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా, ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతినకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారు



**మొదటిపేజీ తరువాయి -** సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, టైల కోసం రూ. 1,200 కోట్లు.. ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరులయ్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని.. అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు.

# సెమీకండక్టర్ల తయారీకి ఏపీ బెస్ట్ డెస్టినేషన్

**మొదటిపేజీ తరువాయి -** అవుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. డిఫెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఫైటర్ జెట్‌ల తయారీ సహా ఆటోమొబైల్ తయారీ కేంద్రంగా రాయలసీమ ప్రాంతంలో అవకాశాలున్నాయని అన్నారు. సెమీకండక్టర్లపై ఏర్పాటు చేసిన సెమీకాన్ ఎకోసిస్టమ్ రౌండ్ టేబుల్ సమావేశానికి సింగపూర్‌లోని వివిధ సెమీ కండక్టర్ తయారీ పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. గ్లోబల్ ఫౌండ్రీస్, ఎన్ఎక్స్ పీ, ఏఎస్ఎంపీటీ, ఒన్ సిస్టమ్ టెక్నాలజీస్, టెక్సెండ్ ఫోటోమాస్క్, ఆక్వాటెక్ తదితర సెమీకండక్టర్ తయారీ సంస్థలు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నాయి.మరావతిని సందర్శించి సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించుకోవాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలకు ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. సింగపూర్‌లో జరుగుతున్న వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశపై చంద్రబాబు ప్రసంగించారు. 25 ఏళ్ల క్రితం తాను ఐటీ గురించి మాట్లాడానని గుర్తు చేశారు. ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని వెల్లడించారు. ఇప్పుడు ఏఐ వచ్చిందని వ్యాఖ్యానించారు. పీపుల్ ఫస్ట్ తమ విధానమని ఈక్విటీ, నేచర్, ఆపర్చ్యునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు.అంతర్జాతీయ మౌలిక వసతులతో అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని వివరించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని తెలిపారు. స్పోర్ట్స్, ఫైనాన్షియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్స్ తీసుకున్నామని వెల్లడించారు.నాలెడ్జ్ సిటీ: ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని, దాన్లో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లుగా ఇస్తున్నట్లు చెప్పారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని తెలిపారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే నేడు రూ.200 కోట్లకు పెరిగిందని గుర్తు చేశారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుం దనేందుకు సైబరాబాద్ నిదర్శనమన్నారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు తీసుకువస్తున్నామన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. సింగపూర్‌లో సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా తొలి రోడ్ షోలో పాల్గొన్నారు. సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి సంబంధాలు ఉన్నాయని సీఎం వ్యాఖ్యానించారు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే తనకు చాలా అభిమానమన్నారు. 3 దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నామని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని వెల్లడించారు. రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చిందని తెలిపారు.రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఏపీ అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేశారు. సింగపూర్ దేశం తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామన్నారు. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చామని తెలిపారు. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుందని వెల్లడించారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అవుతోందని వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాట్లు వివరించారు. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని తెలిపారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా 7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించబోతోందని వెల్లడించారు. ఏపీలో అమలు అవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలన్నారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతల్ని సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్సిటీలు ఉపకరిస్తాయని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగిందని దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయన్నారు.

# జులై మూడో వారంలో 'తల్లికి వందనం'

**మొదటిపేజీ తరువాయి -** పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు.పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం, ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు.రాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక 'ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్‌తో చర్చల కోసం ఇరాన్ వినూత్న వ్యూహం

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుసరించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయడానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సహాయం తీసుకున్నట్లు ఒక కథనం వెల్లడించింది. ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ.. "ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము" అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలుపెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో రాయిటర్స్/ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89% డెమోక్రాట్లు, 30% రిపబ్లికన్లు ఉండటం గమనార్హం.2025 జనవరిలో 80 ఏళ్ల వయసులో ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అమెరికా చరిత్రలోనే అత్యంత వృద్ధ అధ్యక్షుడిగా రికార్డు సృష్టించారు. అప్పటి నుంచి ఆయన పలు దేశాల నుంచి దిగుమతులపై భారీ సుంకాలు విధించడం, అక్రమ వలసదారులను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా ఫెడరల్ ఏజెంట్లను మోహరించడం వంటి వేగవంతమైన, దూకుడైన నిర్ణయాలు తీసుకున్నారు. అనేకమంది విశ్లేషకులు గెలవడం కష్టమని భావించిన యుద్ధంలోకి కూడా అమెరికాను నడిపించారు.దాదాపు 4 నెలల పాటు సాగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లో శుక్రవారం సంతకాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరఫున పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పాల్గొంటారని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి మజీద్ తఖ్త్-రవంచి తెలిపారు.

# హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు

**మొదటిపేజీ తరువాయి -** జవాబుదారీ అని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పని చేశామని, ఇప్పుడూ పని చేస్తామని, తెలంగాణకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశానని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఢిల్లీకు వచ్చి రెండుసార్లు ధర్నా చేశామని గుర్తు చేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని గుర్తు చేశారు.తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితే రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టలేదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 కోసం కేసీఆర్ సహకరించకలేదని ఆరోపించారు. కేసీఆర్ సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించామన్నారు. తెలంగాణకు రాదనుకున్న రైల్వే ఫ్యాక్టరీని సాధించామని, ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు.మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలేనని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్లు వడ్డీ లేకుండా ఇటీవల సాస్కి రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్‌సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందని, ప్రాజెక్టులు ఆపే సంస్కృతి బీజేపీకి లేదని అది కాంగ్రెస్‌కే ఉండవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంకదారిన ప్రాజెక్టులు అడ్డుకోవాల్సిన కర్మ తమకు లేదని, రేవంత్ రెడ్డి కోసమో, మరెవరి కోసమో ప్రాజెక్టులు అడ్డుకోమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రాజెక్టులకు సహకరిస్తామని స్పష్టం చేశారు."మెట్రో ఫేజ్ 2 మరింత వేగవంతానికి నేను సీఎంకు లేఖలు రాశా. ఐఆర్ఎఫ్‌సీతో ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు తీసుకునేందుకు కేంద్రం సహకరించింది. రుణ ఒప్పందం విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. మెట్రో-1 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రుణం తీసుకుంటోంది. రుణం విషయమై రాష్ట్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ మధ్య ఒప్పందం జరిగింది. టికెట్లు, యాడ్ ఆదాయాన్ని ముందుగా అప్పు చెల్లించాలని ఒప్పందం జరిగింది. ఈ విషయమై కేంద్ర సూచనలకు సీఎం అంగీకరించట్లేదని చెప్పారు. అన్ని మెట్రోలు తీసుకున్న రుణాలు వాటికే ముందుగా చెల్లించరు. రెగ్యులర్ మెట్రో ఆపరేషన్, నిర్వహణకు ముందుగా వచ్చిన ఆదాయం చెల్లించాలి. ఆ తర్వాతే రుణాలకు సంబంధించి మిగతా డబ్బులు చెల్లించాలి" - కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

## దేశ రాజధాని ఢిల్లీలో భారీగా పెరిగి జనాభా



**మొదటిపేజీ తరువాయి -** దేశ రాజధాని ఢిల్లీ జనాభా అనూహ్యంగా పెరిగింది. జనగణన 2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ సర్వేలో ఢిల్లీ జనాభా 2.3 కోట్లు దాటినట్టు ప్రాథమికంగా తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.7 కోట్లుగా ఉన్న జనాభా, గత 15 ఏళ్లలో సుమారు 37.5 శాతం పెరగడం గమనార్హం. సెన్సస్ 2027లో భాగంగా చేపట్టిన 'హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' తొలి దశ ప్రక్రియ ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు ఢిల్లీలోని 45,863 బ్లాకులలో పర్యటించి దాదాపు 76 లక్షల ఇళ్లు, 55 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఈ వివరాల ఆధారంగా జనాభాను ప్రాథమికంగా అంచనా వేశారు.అయితే, ఈ గణాంకాలు తాత్కాలికమైనవేనని అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో చేపట్టనున్న రెండో దశ 'జనాభా లెక్కింపు' తర్వాతే తుది జనాభా సంఖ్యను ఖరారు చేస్తారు. రెండో దశలో ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు.జిల్లా వారీగా చూస్తే, ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల జనాభా ఉండగా, నైరుతి ఢిల్లీలో 25 లక్షల మంది నివసిస్తున్నారు. అత్యల్పంగా న్యూఢిల్లీ జిల్లాలో కేవలం 2 లక్షల జనాభా నమోదైంది. 2026 మధ్య నాటికి ఢిల్లీ జనాభా సుమారు 2.3 కోట్లకు చేరుకుంటుందని గతంలో వచ్చిన అంచనాలకు, తాజా గణాంకాలు దగ్గరగా ఉండటం విశేషం.

## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు



**మొదటిపేజీ తరువాయి -** బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారుల గురించి కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులతో ఇక్కడి ముస్లిం సమాజాన్ని పోల్చడం ద్వారా కాంగ్రెస్ వారిని అవమానిస్తోందని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్రం వేగంగా దూసుకుపోవాలంటే 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాలని, ఈసారి ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని ప్రజలను కోరారు.మావోయిస్టుల గురించి మాట్లాడుతూ... సమాజంలో తుపాకీ సంస్కృతి, మారణహోమంతో సాధించేది ఏమీ లేదన్నారు. ఏమీ తెలియని మైనర్ పిల్లల చేత తుపాకులు పట్టించడం అత్యంత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది మావోలు లొంగిపోయారని, ఇంకా ఆ ఆలోచనల్లో ఉన్నవారు భవిష్యత్తు కోసం మారాలని పిలుపునిచ్చారు.

www.akshratimes.com

తెలుగు దినపత్రిక

అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

# ఉపాధి పని చేస్తూ గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి





**వేలేరుపాడు, జూన్ 16.అక్షర టైమ్స్ :** ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని జిన్నాల గూడెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ ఈజీ ఎస్) పనులు జరుగుతున్న ప్రదేశంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పని చేస్తుండగానే గుండెపోటుకు గురైన కూలీ అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. జిన్నాలగూడెం గ్రామానికి చెందిన తురసం పెద జోగయ్య (65) మంగళవారం ఉదయం ఇతర కూలీలతో కలిసి ఉపాధి హామీ పనులకు హాజరయ్యారు.ఎప్పటిలాగే ఉత్సాహంగా పనులు చేస్తున్న పెద జోగయ్య అకస్మాత్తుగా కుప్పకూలి పోయాడు.ఇది గమనించిన తోటి కూలీలు వెంటనే ఆయన ను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే ఫలితం లేకపోయింది. గుండెపోటుతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో పని ప్రదేశంలో ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. కొద్దిసేపటి క్రితం వరకు తమతో కలిసి పనిచేసిన పెద జోగయ్య ఒక్కసారిగా మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక తోటి కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని బోరున విలపించడంతో హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి.సమాచారం అందుకున్న కోదాడ ఎంపీడీవో శ్రీహరి ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పెద జోగయ్య మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఆయన, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున అందే సహాయం పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.పేద కుటుంబానికి చెందిన పెద జోగయ్య ఉపాధి హామీ పనుల ద్వారానే జీవనోపాధి పొందుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, ప్రత్యేక పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# దర్శిలో రెండేళ్ల కూటమి పాలన పై విజయోత్సవ సభకు విశేష స్పందన







**దర్శి,జూన్16.అక్షర టైమ్స్ :** దర్శి లో మంగళవారం దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం రెండేళ్ల కూటమి పాలనపై విజయోత్సవ సభకు అనూహ్య స్పందన లభించినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ , నియోజకవర్గ పరిశీలకులు రాఘవేంద్ర , మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు , టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ , దర్శి సొసైటీ అధ్యక్షులు కలువకొలను చంద్ర శేఖర్, దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగవేణి - సుబ్బారావు , దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య , తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు , టిడిపి, జనసేన, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కూటమి శ్రేణులు పాల్గొన్నారు. మరియు నియోజకవర్గ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎఫ్ఎస్ఓ ఆఫీసర్ శాంతి లక్ష్మీ, ఎంపీడీఓ పి. కల్పన, అగ్రికల్చర్ ఏఓ అనురాధ, ఆర్?డబ్ల్యుఎస్ డి ఈ, మున్సిపల్ కమిషనర్ అర్జున్ రావు పాల్గొన్నారు. నియోజకవర్గం లో గల దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాలకు సంబంధించిన ముఖ్య నాయకులు మండల టిడిపి అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, పిడతల నెమిలయ్య, కూరపాటి శ్రీను, మేడం వెంకటేశ్వర రెడ్డి, దర్శి టౌన్ టిడిపి అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ పాల్గొన్నారు. జనసేన నాయకులు ఉల్లి బ్రహ్మయ్య, పుప్పాల పాపారావు, కోట హనుమంత రావు, దర్శి టౌన్ అధ్యక్షులు చాతరాసి కొండయ్య, రుద్రసముద్రం హనుమంత రావు, తాళ్లూరు మండల పార్టీ అధ్యక్షులు, కుటాల ప్రసాద్, పసుపులేటి చిరంజీవి, బిజెపి నాయకులు రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్ట్ మాడపాకుల శ్రీనివాసరావు, బిజెపి జిల్లా కమిటీ సభ్యులు తిండి నారాయణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కురిచేడు, ముండ్లమూరు, దర్శి కురంగి నాగేశ్వరావు, శేషయ్య, నాగసాయి, దర్శి టౌన్ అమర్ మరియు ఒంగోలు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు కాట్రాజు నాగరాజు, రాష్ట్ర నాటక కళాపరిషత్ డైరెక్ట్ బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, మనం రమేష్, వల్లపునేని సుబ్బయ్య, నాగుల పాటి శివకోటేశ్వర రావు, సోమేపల్లి శ్రీను, రమణ యాదవ్, నూనె విజయ కుమారి, శోభారాణి, క్లస్టర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టీవెన్, తలారికోటయ్య, కౌన్సిలర్లు, వార్డ్ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూనిట్ ఒ బూత్ ఇంచార్జీలు, సొసైటీ అధ్యక్షులు, నీటిసంగం డిసిలు, అధ్యక్షులు, మార్కెట్ యాడ్ డైరెక్టర్లు, ఐ. టిడిపి సభ్యులు, తెలుగు యువత, నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు, టిడిపి జనసేన, బిజెపి నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభినందనలు వేలాదిగా పాల్గొన్నారు.

# ప్రతి గడపకి వెళదాం రెండేళ్ల కూటమి పాలనలో చేసిన అభివృద్ధిని గర్వంగా చెప్పుకుందాం

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ







**దర్శి,జూన్ 16.అక్షర టైమ్స్ :** దర్శి టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నాయకత్వం లో మంగళవారం దర్శి పట్టణం, కురిచేడు రోడ్, లోని పి.టి.యస్ కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం రెండేళ్ల కూటమి పాలనపై విజయోత్సవ సభ లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయగలిగా, ఒక వైపు సంక్షేమ మరో ఒకవైపు అభివృద్ధి చేస్తూ నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నాం అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న సందర్భంగా రెండేళ్ల ప్రజల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం విజయోత్సవ సభను మంగళవారం దర్శి పట్టణంలో పిటిఎస్ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించుకుంటున్నాం అని అన్నారు. రెండేళ్ల కూటమిపాలనలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పరుగులు తీస్తుంది మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజనరీ నేతగా ప్రజల భవిష్యత్తు కోసం బాటలు వేస్తూ ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మన పిల్లల భవిష్యత్తు కోసం పరిశ్రమలు ఉపాధి విద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ కొత్త సాంకేతిక విప్లవంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాంకేతిక రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారు అని అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మనం ముందుకు వెళుతున్నాం. మన నియోజకవర్గంలో గత ఐదేళ్ళు వైసిపి పాలనలో విధ్వంసం చూసాం, మన కూటమి ఏర్పడ్డ రెండు సంవత్సరాలలో అభివృద్ధి సంక్షేమం ప్రతి గడపకు చేర్చాలన్న లక్ష్యంతో ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం మీ గొట్టిపాటి లక్ష్మి మీ కుటుంబ సభ్యురాలుగా కూటమి ప్రతినిధిగా నిరంతరం శ్రమిస్తుంది మీరు చూస్తున్నారు, మీరు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు అని లక్ష్మీ అన్నారు. గ్రామ గ్రామాన రోడ్లు నిర్మించుకుంటున్నాం, మౌలిక సదుపాయాలు కల్పించుకుంటున్నాం, ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళుతున్నాం అని అన్నారు. ప్రతి గడపకు ఒకటవ తేదీ పెంచిన పెన్షన్లను పంపిణీ చేస్తున్నాం. ప్రతి కుటుంబంలో అందరి పిల్లలకు తల్లికి వందనం కింద చదువుకునేందుకు ప్రోత్సాహం అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ దర్శి లో ప్రారంభమై ప్రతి రైతుకు భరోసానిచ్చింది. ముఖ్యమంత్రి దర్శిలో రైతన్న పథకాన్ని ప్రారంభించడం శుభ పరిణామం. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు సౌకర్యం, డ్వాక్రా మహిళలకు రుణ వసతి, అన్న క్యాంటీన్ ఏర్పాటు, డిగ్రీ కాలేజీ, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ లను ముందుకు తీసుకు వెళుతున్నాం అని అన్నారు. లో వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 20 కోట్లతో సబ్స్టేషన్ నిర్మించుకుంటున్నాం. మొగిలిగుండం ప్రాజెక్టును పూర్తి చేశాం. త్వరలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసుకుంటున్నాం. దర్శి లో టీటీడీ కళ్యాణ మండపం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మినీ స్టేడియంలో ముందుకు తీసుకు వెళుతున్నాం. నగర పంచాయతీగా ఉన్న దర్శిని థర్డ్ గేర్ మున్సిపాలిటీగా మార్చుకొని పది కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం అని అన్నారు. ఇలా నిరంతరం అభివృద్ధి సంక్షేమంతో ముందుకు వెళుతుంటే గొడ్డలి పార్టీ వైసిపి దుష్ప్రచారం చేస్తుంది. వారి దుష్ప్రచారాన్ని మనం తిప్పి కొట్టాలి. ఐదు సంవత్సరాలలో వైసిపి ఒక టీచర్ పోస్టు అయిన ఇచ్చిందా అని ప్రశ్నిస్తున్నాను. టీచర్ పోస్టు ఇవ్వకపోగా టీచర్లను చాలా దారుణంగా చూశారు. మన ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీ తో 16,347 వేల మంది టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన లోకేష్ అన్నది. అది చూసి ఓర్వలేక డీఎస్సీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులలో అలజడి కలిగిస్తున్నారు. ఇలాంటి వాటిని మనం ఖండించాలి. గెలిచిన ఎమ్మెల్యే ప్రజల కోసం ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నాను. అసెంబ్లీకి వెళ్ళరు, ప్రజాసమస్యలు ప్రశ్నించరు, ప్రజా సమస్యల కోసం పనిచేయరు, డీఎస్సీలో 15 లక్షలు తీసుకున్నారని ఆరోపించడం ఏమిటని తీవ్రంగా దీనిని మనమందరం తిప్పి కొట్టాలన్నారు. సైకో పార్టీ గ్లోబల్ ప్రచారాలను మనం తిప్పి కొట్టాలి. కలిసికట్టుగా ముందుకు వెళ్లాలి. కూటమి ప్రభుత్వం నాలుగు కాలాలపాటు అధికారంలో ఉంటే మన భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు, ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు దేశ దేశాలలో విస్తరిస్తుంది. మనం బాగుంటాం, మన పిల్లలు బాగుంటారు. అందుకే ఐక్యంగా ముందుకు వెళదాం, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులను ఏకపక్షంగా గెలిపించుకుందాం. మీ గెలుపే నా గెలుపు నేను ఓడిపోయిన ప్రజల హృదయాలలో గెలిచాను. దర్శి ప్రజల రుణం తీర్చుకుంటాను. వచ్చే ఎన్నికల్లో దర్శిలో తెలుగుదేశం జెండా ఎగర వేద్దాం. కూటమి ఐక్యంగా ముందుకు వెళదాం. ప్రతికూటమి నాయకులు, కార్యకర్తలు నా కుటుంబ సభ్యులు. అమరావతిని విధ్వంసం చేశారు, పోలవరం నాశనం చేశారు, అమరావతి బిల్లును ప్రవేశపెట్టుకొని చట్టబద్ధత కల్పించుకోగలిగాం. అమరావతిలో పనులు చేరవేగంగా జరుగుతున్నాయి. అనేక పరిశ్రమలు ఆంధ్ర రాష్ట్రం వైపు చూస్తున్నారు. దేశ దేశాలలో పర్యటిస్తూ పెట్టుబడులను ఆహ్వానిస్తూ ఆంధ్ర రాష్ట్రంలో సుస్థిరత పాలన కోసం చంద్రబాబు చేస్తున్న నిరంతర యజ్ఞంలో మనం కూడా భాగస్వామ్యం అవుతాం. అభివృద్ధి ఎజెండాగా ముందుకు వెళదాం. సంక్షేమాన్ని ప్రతి గడపకు చేరుద్దాం వైసిపి తప్పుడు ప్రచారాలను తిప్పికొడదాం. నేను ప్రజల కోసం పనిచేస్తాను. పదవుల కోసం పనిచేయడం లేదు. నాకు పదవులు కొత్త కాదు గొట్టిపాటి కుటుంబంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. మీ అందరికీ తెలుసు మా తాత జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, మంత్రి. మా నాన్న ఎమ్మెల్యే, మా బాబాయి గొట్టిపాటి రవి ప్రస్తుతం మంత్రి. మాకు పదవులు కొత్త కాదు, మేము పదవుల కోసం రాజకీయాలు లో లేము ప్రజల నమ్మకం కోసం ప్రజల ఆకాంక్షలను నిలబెట్టేందుకు ప్రజల కోసం పనిచేయడం మా ప్రయాణం అని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు.

# గత ఐదేళ్ల పాలనలో గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చింది

## శాసనసభ్యులు వనమాడి కొండబాబు



**కాకినాడ,జూన్16.అక్షర టైమ్స్ :** గత ఐదేళ్ల పాలనలో గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిందని, తన అక్కను వైసిపి నాయకులు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు 10 వ తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ ను వైసిపి పార్టీ వాళ్లు దారుణ హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టారని శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.గత వైసిపి ప్రభుత్వ పాలనలో తన అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు వైకాపా వాళ్ళు పెట్రోల్ పోసి దారుణ హత్య చేసిన బాపట్ల జిల్లాకు చెందిన 10 వ తరగతి విద్యార్థి "అమర్నాథ్ గౌడ్" వర్ధంతి సందర్భంగా సంజయ్ నగర్ నందు నిర్వహించిన కార్యక్రమంలో అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి శాసనసభ్యులు వనమాడి కొండబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో నేరస్తులకు వైసీపీ పాలెగాళ్లు అండగా నిలిచారని, వైసీపీ పాలకుల అక్రమాలకు దౌర్జన్యాలను ప్రశ్నిస్తే దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని, రేపల్లె నియోజకవర్గంలో అమర్నాథ్ గౌడ్ అనే పదో తరగతి పిల్లాడిని వైసీపీ నేతల పెట్రోల్ పోసి తగులబెట్టి చంపేశారని, ఈ దారుణమైన సంఘటనకు నేటికి మూడేళ్లు (2023 జూన్) అయ్యిందని, గత గొడ్డలి పార్టీ పాలనలో ఒకటి కాదు రెండు కాదు లెక్కలేనన్ని దారుణాలు జరిగాయిని, అక్కను వేధిస్తున్నారని అమర్నాథ్ గౌడ్ ప్రశ్నించినందుకు వైసీపీ నేత, మరో ముగ్గురు కలిసి పెట్రోల్ పోసి హత్య చేశారని, అమర్నాథ్ గౌడ్ను హత్య చేసిన నిందితులు బెయిల్పై విడుదలై దర్జాగా తిరుగుతునే ఉన్నారని, బాధితులు దుఃఖంలో మునిగి ఉంటే నిందితులు మాత్రం డాన్సులు వేస్తూ కనిపించే వారిని, అమర్నాథ్ గౌడ్ హంతకుల్లో ఒకడైన పాము వెంకటేశ్వర రెడ్డి బెయిల్పై బయటకొచ్చి, బాధిత కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరించేవాడని, అమర్నాథ్ గౌడ్ ఘటన ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదు అప్పటి గొడ్డలి పార్టీ హయాంలో శాంతిభద్రతలు ఎలా పడకేశాయో తెలిపే నిదర్శనం అని, బీసీలకు అండగా ఉన్నామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం, అదే బీసీ కుటుంబానికి అన్యాయం చేసిందని, అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అండగా నిలివడమే కాకుండా.. బాధితులకు ధైర్యాన్ని కల్పించిందని, అమర్నాథ్ గౌడ్ లాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల సునీత రమేష్, దాసరి శ్రీను, ముత్యం, లోటుకుర్తి మోహన్, పాలిక నాని, దాసరి మని, పాలిక సూర్య, తదితరులు పాల్గొన్నారు.

# భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి

## వైఎస్ఆర్సీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ నిలిపివేత హేయమైన చర్య:

## వైకాపా రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు



**గోకవరం,జూన్16.అక్షర టైమ్స్ :** ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీకి తమ అభిప్రాయాలను ప్రజలకు తెలియజేసే హక్కు ఉందని, అలాంటి సమయంలో వైఎస్ఆర్సీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని అందుబాటులో లేకుండా చేయడం భావ ప్రకటన స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావిస్తున్నామని వైఎస్ఆర్సీపీ అధికార ప్రతినిధి గుల్లా ఏడుకొండలు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికలు ప్రజలకు సమాచారం చేరవేసే ప్రధాన సాధనాలుగా మారాయని, రాజకీయ ప్రత్యర్థుల గొంతు నొక్కే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. వైఎస్ఆర్సీపీ పార్టీకార్యకలాపాలు,ప్రజాసమస్యలపై పార్టీ వైఖరిని ప్రజలకు తెలియజేసే అధికారిక ఫేస్‌బుక్ పేజీని నిలిపివేయడం వెనుక ఉన్న కారణాలను సంబంధిత సంస్థలు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలకు స్థానం ఉండాలని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగా సోషల్ మీడియా వేదికలను ఉపయోగించడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజల సమాచార హక్కును హరిస్తాయని, భావ ప్రకటన స్వేచ్ఛను అణగదొక్కే ప్రయత్నాలను ప్రజలుగమనిస్తున్నారని తెలిపారు.వైఎస్ఆర్సీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని వెంటనేపునరుద్ధరించాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని గుల్లా ఏడుకొండలు కోరారు.

# గోకవరం లో సోనీ కంపెనీ కెమెరా మీద వర్క్ షాప్





**గోకవరం,జూన్16.అక్షర టైమ్స్ :** గోకవరం మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలు స్టూడియో అధినేత బాలు సౌజన్యంతో సోనీ ఉత్పత్తుల ప్రదర్శన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సోనీ కంపెనీ ఫ్యాకల్టీ చైతన్య ఫోటోగ్రాఫర్స్ కి అర్థమయ్యే రీతిలో ఫోటో కెమెరా లో ఉన్న మెలకువలను వివరించారు.ప్రస్తుత ఉన్న టెక్నాలజీలో సోనీ కెమెరాలో వున్న కొత్త మెలుకువలు తో కూడిన ఆప్షన్స్ ను గురించి వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ కస్టమర్ కి మెప్పించే విధంగా ఫోటోగ్రాఫర్ మెలగాలని కస్టమర్ తో మన కలిసిమెలిసి ఉండాలని ఈ వర్క్ షాప్ ద్వారా తెలుసుకున్న ఆప్షన్స్ని కెమెరాని ఉపయోగించాలని తెలియ జేశారు. అనంతరం ఫ్యాకల్టీ చైతన్య, బాలు, రావు అండ్ రావు లను సాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండలంలో ఉన్న పలు గ్రామాల ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

# సజ్జల రామకృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గుల్లా ఏడుకొండలు



**గోకవరం,జూన్16.అక్షర టైమ్స్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వైకాపా రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని గుల్లా ఏడుకొండలు పేర్కొన్నారు.సజ్జల రామకృష్ణారెడ్డి మరింత ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సజ్జల రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పట్టుదలే విజయానికి పునాది


## యువ క్రీడాకారుల ప్రతిభను అభినందించిన నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్,జూన్16.అక్షర టైమ్స్:- ప్రతినిధి గోపగాని పాండు :** మల్లాపూర్ డివిజన్‌లో నిర్వహించిన జిఎస్ ఫిట్నెస్ స్టూడియోలో నిర్వహించిన పోటీలు యువ క్రీడాకారుల ఉత్సాహం, పట్టుదలకు ప్రతీకగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ విజేతలకు పతకాలు, బహుమతులు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని కూడా పెంపొందిస్తాయని అన్నారు. యువత క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచే యువతకు ప్రతి స్థాయిలో ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. స్థానిక వ్యాయామశాలలో నిర్వహించిన ఈ పోటీలలో పలువురు క్రీడాకారులు తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. నిర్వాహకుడు గౌతమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌తో పాటు క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని పలువురు అభిప్రాయపడ్డారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా



# వృద్ధుల అభివృద్ధికి అండగా నిలుస్తాం






### పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఉప్పల్ వృద్ధుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధుల హక్కుల పరిరక్షణ, వారి భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంఘటితంగా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉప్పల్‌లో స్థలం కేటాయించి, సొంత భవనాన్ని నిర్మించి అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.వృద్ధుల అనుభవం సమాజానికి మార్గదర్శకమని, వారి సూచనలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. భవిష్యత్తులో కూడా వృద్ధుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, వృద్ధుల సంఘం అధ్యక్షుడు మేకల రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, ఇతర పదాధికారులు, సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో వృద్ధులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా, వృద్ధుల సేవలకు అంకితభావంతో పనిచేయాలని పలువురు అభిప్రాయపడ్డారు.

# మల్లాపూర్ ముద్దుబిడ్డ సురేషన్నకు ఘన నివాళులు

### ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ముద్ర వేసిన నాయకుడు





**మల్లాపూర్,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు, దివంగత ప్రజానేత స్వర్గీయ నెమలి సురేష్ 56వ జయంతి సందర్భంగా ఉమ్మడి మల్లాపూర్ డివిజన్ పరిధిలోని స్వామి వివేకానంద నగర్ కాలనీలో ఆయన విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు సురేషన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజా సేవకు జీవితాంతం అంకితభా వంతో పనిచేసిన సురేషన్న సేవలను స్మరించుకుంటూ, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలిచి అందరి మన్ననలు పొందిన నాయకుడిగా కొనియాడారు. ఆయన ఆశయాలు, సేవా తత్వం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, "పదవులు శాశ్వతం కావు.. కానీ ప్రజల కోసం చేసిన సేవ శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతుంది. నెమలి సురేష్ అన్న జీవితం ప్రజాసేవకు చిరునామా. ఆయన ఆశయ సాధనే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి" అని అన్నారు.కార్యక్రమంలో నెమలి రవికుమార్, పి. వీరస్వామి, సీతాల వీరస్వామి, పీజీ సుధర్శన్, దంతూరి రాజు గౌడ్, సద్గుణరావు, అనిల్ జైన్, పీఆర్ మోహన్, కోయలకొండ రాజేష్, నెమలి శ్రావణ్, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, చారి, కాటం గౌడ్, నెమలి సందీప్, వెంకటేశ్వర్లు, షేక్ అన్వర్, విజయ్ రెడ్డి, యాదగిరి, జహంగీర్, సురేష్, నవీన్‌తో పాటు సూర్యచంద్ర యూత్ క్లబ్ సభ్యులు, మహిళలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ డివిజన్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సురేషన్నకు ఘనంగా నివాళులర్పించారు."జోహార్ సురేషన్న... మీ సేవలు చిరస్మరణీయం.. మీ జ్ఞాపకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి" అంటూ అభిమానులు భావోద్వేగంగా నివాళులర్పించారు.


# సంజయ్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలో రూ.4 కోట్లతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొండబాబు శంకుస్థాపన




**కాకినాడ,జూన్16.అక్షర టైమ్స్ :** కాకినాడ నగర అభివృద్ధిలో కీలకమైన సంజయ్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలోని 700 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ రహదారి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ఆయన పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, సర్పవరం జంక్షన్ నుండి పాత పోర్టు పోలీస్ స్టేషన్ వరకు స్మార్ట్ సిటీ నిధులతో రహదారి నిర్మాణం గతంలో చేపట్టినప్పటికీ, మధ్యలో ఉన్న సంజయ్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా సుమారు 700 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.డంపింగ్ యార్డును తరలించేందుకు గతంలో పెద్దాపురం ప్రాంతంలో 12 ఎకరాల స్థలాన్ని గుర్తించినప్పటికీ, అప్పటి రాజకీయ పరిస్థితులు మరియు కొంత మంది వైసీపీ నాయకుల అడ్డంకుల కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదని ఆయన ఆరోపించారు. లేదంటే అప్పుడే డంపింగ్ యార్డును అక్కడికి తరలించి ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేవారమన్నారు.వైసీపీ పాలనలో ప్రజలపై చెత్త పన్ను విధించి భారం మోపారని విమర్శించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం తమ ప్రభుత్వం నగర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సంజయ్ నగర్ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన ఘన వ్యర్థాలను త్వరలోనే జిందాల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఈ 700 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే సర్పవరం జంక్షన్ నుంచి పాత పోర్టు పోలీస్ స్టేషన్ వరకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజనీర్ పీ. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, నాయకులు తుమ్మల సునీత రమేష్, అల్లం రాజు, ఏరిపిల్లి రాము, మూగు రాజు, చోడిపిల్లి సతీష్, లూటికుర్తి మోహన్, మోసా పేతురు, గాది శివ, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో 98 వ్యాయామశాలల అభివృద్ధి కోసం కృషి చేయాలి

### మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు
### హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ వినతి



**హైదరాబాద్,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** నగరంలోని వ్యాయామశాలల (అకాడాల) అభివృద్ధికి, పైల్వాన్ల సంక్షేమానికి తమ వంతు కృషి చేయాలని హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, నగర అధ్యక్షులు సంతోష్ పైల్వాన్ కోరారు. మంగళవారం గోషామహల్ పరిధిలోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలోని వ్యాయామశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, ఒక వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగరంలో దాదాపు 98 అకాడ వ్యాయామశాలలు ఉన్నాయని, సరైన క్రీడా సామాగ్రి, కనీస వసతులు లేకపోవడం వల్ల పైల్వాన్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ, సరైన ప్రోత్సాహం, సౌకర్యాలు లేక వెనుకబడిపోతున్నారని పేర్కొన్నారు. "నగరంలోని వ్యాయామశాలలకు పునర్వైభవం తీసుకురా వాల్సిన అవసరం ఉంది. పైల్వాన్లకు కావలసిన ఆధునిక సామాగ్రిని, వసతులను కల్పించి, వారి సమస్యల పరిష్కారానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవ చూపాలి."

### గడ్డం శ్రీనివాస్ యాదవ్ & సంతోష్ పైల్వాన్

ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అకాడాల అభివృద్ధికి మరియు పైల్వాన్ల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మియాపూర్ మంగళవారం మార్కెట్‌ను యథావిధిగా నిర్వహించాలి

### ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి
### స్ట్రీట్ వెండర్స్ సమస్యను పరిష్కరించిన చేవెళ్ల ఎంపీ, శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్
### పేద వ్యాపారులకు అండగా ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి: సీఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడి మార్కెట్‌కు అనుమతి
### 20 ఏళ్లుగా ఉన్న మార్కెట్‌ను అడ్డుకోవడం ఏంటి?: రేవంత్ రెడ్డి మీటింగ్‌కు లేని అభ్యంతరం వీళ్లకు ఎందుకు?




**మియాపూర్,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** మియాపూర్ డివిజన్, న్యూ కాలనీ శివాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్ వద్ద గత 20 సంవత్సరాలుగా ప్రతి మంగళవారం నిర్వహించుకునే కూరగాయలు, పండ్లు, ఇతర చిన్న వ్యాపారాల మార్కెట్‌ను యథావిధిగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ స్పష్టం చేశారు.ఇక్కడ ఎంతోకాలంగా వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న స్ట్రీట్ వెండర్స్ (వీధి వ్యాపారులను) షాపులు పెట్టుకోకుండా సీఆర్పీఎఫ్ అధికారులు, స్థానిక పోలీసులు అడ్డుకుంటున్నారనే సమాచారం తెలియడంతో ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రవికుమార్ యాదవ్ వెంటనే మార్కెట్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం సీఆర్పీఎఫ్ కేంద్ర ఉన్నతాధికారులతో నేరుగా మాట్లాడి, ప్రతి మంగళవారం పేద వ్యాపారులు తమ వ్యాపారాలను ఇక్కడే యథావిధిగా నిర్వహించుకునేలా సమస్యను పరిష్కరించారు.


### అధికారులను ప్రశ్నించిన నేతలు

ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ... గత రెండు దశాబ్దాలుగా ఇదే ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటు చేసుకుని ఎంతోమంది పేదలు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. వీరంతా ప్రతిరోజూ వేర్వేరు ప్రాంతాల్లో మార్కెట్ పెట్టుకుంటూ పొట్టకూటి కోసం కష్టపడేవారని పేర్కొన్నారు. ఇంతమంది పేద వ్యాపారులను అడ్డుకున్న అధికారులు, మొన్న ఇదే స్థలంలో జరిగిన రేవంత్ రెడ్డి మీటింగ్‌కు ఏ విధంగా అనుమతి ఇచ్చారని వారు నిలదీశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వ్యాపారులకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇప్పించినట్లు వారు వెల్లడించారు. మార్కెట్ నిర్వహణకు తిరిగి అనుమతి లభించడంతో ఉపాధి కోల్పోయే ప్రమాదం నుంచి తప్పించుకున్న మార్కెట్ వ్యాపారులు ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డికి, నేత రవికుమార్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.

### పాల్గొన్న ముఖ్య నేతలు

ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బి.ఎస్.ఎన్. కిషోర్ యాదవ్, మహేష్ యాదవ్, లక్ష్మణ్, గణేష్, పట్టాభిరామ్, పవన్, విజయేందర్, శ్రీనివాస్, రాము, బసవ శివ, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన వి.హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు



**కీసర,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమం, అభివృద్ధి సలహాదారు వి. హనుమంతరావు జన్మదిన సందర్భంగా కీసర మండల సామాజిక సేవా కార్యకర్త, కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు తుడుం శ్రీనివాస్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వి. హనుమంతరావు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రజానాయకుడని పేర్కొన్నారు. బీసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ప్రభుత్వానికి ప్రజల గొంతుకగా నిలుస్తూ సేవలు అందిస్తున్నారని కొనియాడారు.సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచి, వారి అభివృద్ధికి మార్గదర్శకంగా వ్యవహరిస్తున్న వి. హనుమంతరావు సేవలు యువతకు ఆదర్శమని తుడుం శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం ఆయన ప్రత్యేకత అని అన్నారు.ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తూ వి. హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను కల్పించండి

### మార్కాపురం జిల్లా జర్నలిస్టులు




**మార్కాపురం,జూన్16.అక్షర టైమ్స్ :** మార్కాపురం జిల్లా జర్నలిస్టులు మార్కాపురం జిల్లాలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని కనిగిరి డివిజన్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. మార్కాపురంలో జిల్లా కలెక్టర్ విజయ సునీత గారిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ... విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఉచితంగా భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఆ కోటా పరిధిలోనే జిల్లావ్యాప్తంగా ఉన్న అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు కూడా ఉచిత విద్యను అందించేలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేలా అక్కడి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.కనిగిరి డివిజన్ ప్రెస్ క్లబ్ ప్రతినిధుల విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ విజయ సునీత సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అమలయ్యేలా త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కనిగిరి డివిజన్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నున్నా కృష్ణ, గౌరవాధ్యక్షులు మాకినేని నరసింహారావు, గౌరవ సలహాదారు షేక్ మస్తాన్ భాష, ఉపాధ్యక్షులు చెరుకూరి నరసింహారావు (బుజ్జి), ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ చందన షరీఫ్, సహాయ కార్యదర్శి నరాల మురళి తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపాలిటీ కార్మికులకు పారిశుధ్య నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం



**గిద్దలూరు,జూన్16.అక్షర టైమ్స్ :** గిద్దలూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో, నాలెడ్జ్ పార్ట్నర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల కోసం సామర్థ్య వృద్ధి మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ శ్రీ ఈ.వి. రమణ బాబు హాజరై మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారి ఆరోగ్య భద్రత, పని నైపుణ్యాల పెంపు, ఆధునిక పారిశుధ్య పద్ధతులపై అవగాహన పెంచడం ద్వారా మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరని తెలిపారు.

# గుడిమెట్ట శంకరుని చెరువు సప్లై ఛానల్ కు మరమ్మత్తులు



**రాచర్ల/గుడిమెట్ట,జూన్16.అక్షర టైమ్స్ :** గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముందస్తు చూపుతో రాచర్ల మండలంలోని గుడిమెట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులకు మేలు చేకూర్చాలనే సంకల్పంతో గుడిమెట్ట గ్రామంలోని శంకరుని చెరువు సప్లై ఛానల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో వెనువెంటనే రంగంలోకి దిగిన అధికారులు శంకరుని చెరువు సప్లై ఛానల్ మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ సప్లై ఛానల్ పనులు పూర్తి అయితే ఆయకట్టు కింద ఉన్నటువంటి 402.77 ఎకరాల వ్యవసాయ భూములకు రైతులకు ఎంతో మేలు కలగనుంది. తమ సాగునీటి కష్టాలను తీరుస్తూ, పంట పొలాలకు నీరందించేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే కి ఆయకట్టు ప్రాంత రైతులు మరియుగుడిమెట్ట స్థానిక ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# వర్షాకాల సన్నద్ధతపై మల్కం చెరువు వద్ద ఉన్నతాధికారుల అత్యవసర సమీక్ష

**ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి: డీజీపీ సివి.ఆనంద్**

**క్షేత్రస్థాయిలో పర్యటించిన ప్రత్యేక ఇంజనీరింగ్ బృందాలు.. నివేదికలకు ఆదేశం**





**హైదరాబాద్,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వర్షాకాలంలో నీటి నిల్వలు, పట్టణ వరదలు, ట్రాఫిక్ అంతరాయాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం మల్కం చెరువు వద్ద ఉన్నతాధికారుల అత్యవసర సమన్వయ సమీక్షా సమావేశం జరిగింది.ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం మరియు క్షేత్రస్థాయి పర్యటనలో రాష్ట్ర డీజీపీ సివి.ఆనంద్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిలతో పాటు ఇరిగేషన్, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

**అలసత్వం వద్దు.. ప్రజల భద్రతే ముఖ్యం: డీజీపీ**

ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా పోలీసు శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని తెలిపారు.నగరంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి.ప్రత్యామ్నాయ మార్గాలు: అవసరమైన చోట్ల ముందస్తుగానే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలి.లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలి. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా తక్షణమే స్పందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

**రంగంలోకి ప్రత్యేక బృందాలు.. క్షేత్రస్థాయి పరిశీలన**

సమావేశం అనంతరం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు ప్రత్యేక ఇంజనీరింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు క్రింది ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు జరిపాయి.మల్కం చెరువు, ఖాజాగూడ సరస్సు, మండికుంట, గురునాథ్ చెరువు, మియాపూర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, బయోడైవర్సిటీ జంక్షన్, కొండాపూర్ మరియు ఇతర వరద ప్రభావిత ప్రాంతాలు.ఈ పర్యటనలో నీటి ప్రవాహ మార్గాలు, ఆక్రమణలు, డ్రైనేజీ అనుసంధానాలు, నీటి నిల్వలకు గల కారణాలను సమగ్రంగా పరిశీలించారు. తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా దీర్ఘకాలిక, శాశ్వత పరిష్కారాలపై నివేదికలను సమర్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

**శాఖల మధ్య సమన్వయమే కీలకం**

పోలీస్, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హైడ్రా మరియు ఇతర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. ఎక్కడా అలసత్వానికి తావు ఇవ్వకుండా, వర్షాకాలం పూర్తయ్యే వరకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి ప్రజల భద్రత, సౌకర్యాలను కాపాడాలని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా 'బ్రేక్ ఫాస్ట్ మిల్క్' పథకం ప్రారంభం

**ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు రుచికరమైన అల్పాహారం,పాలు,రాగిజావ**

**మెనూ ప్రకారం పంపిణీకి అరికెపూడి గాంధీ ఆదేశం**

**సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు**



**శేరిలింగంపల్లి,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న :** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహార పంపిణీ ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ మిల్క్ పథకం" ఘనంగా ప్రారంభమైంది. ప్రీ-ప్రైమరీ స్థాయి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఈ అల్పాహార పథకం వర్తించనుంది. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా ప్రతిరోజూ రుచికరమైన టిఫిన్‌తో పాటు పాలు లేదా రాగి మాల్ట్ (జావ) అందించేలా ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించింది.

వారం రోజుల్లో అందించే అల్పాహార మెనూ వివరాలు:

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలల్లో ప్రతిరోజూ కింది విధంగా అల్పాహారం పంపిణీ చేయనున్నారు:

సోమవారం: దోసె - చట్నీ లేదా చపాతీ - కూర మరియు పాలు

మంగళవారం: మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ మరియు రాగి జావ

బుధవారం: పూరీ (2) - ఆలూ కుర్మా మరియు పాలు

గురువారం: మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ మరియు రాగి జావ

శుక్రవారం: మిల్లెట్ ఉప్మా లేదా పొంగల్ - చట్నీ మరియు పాలు

శనివారం: బొండా (2) - చట్నీ మరియు రాగి జావ

గమనిక: వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో పాలు.. మంగళ, గురు, శనివారాల్లో రాగి జావ విద్యార్థులకు అందజేస్తారు.

శేరిలింగంపల్లిలో పకడ్బందీగా అమలు:

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఈ పథకాన్ని అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన వీక్లీ మెనూ ప్రకారమే విద్యార్థులందరికీ నాణ్యమైన అల్పాహారాన్ని, పాలు/రాగిజావను అందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అరికెపూడి గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. పేద విద్యార్థులకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుందని, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడానికి ఇది దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

**అభివృద్ధి-సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి**





**కావలి,జూన్16.అక్షర టైమ్స్ :** రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన విజయోత్సవ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. విజయోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరిదేవి గార్డెన్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రత్యేక స్టాళ్లను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సందర్శించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల విజయగాథలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు గారి ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో కావలి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ప్రజలు, అధికారులు, సిబ్బంది, కూటమి నాయకుల ఉత్సాహభరిత పాల్గొనికతో కస్తూరిదేవి గార్డెన్స్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.

# పొదలకూరులో ఘనంగా హనుమజ్జయంతి అనంతర ఉత్సవాలు

**మారుతీనగర్‌లో భక్తి పారవశ్యం**

**పొదలకూరు,జూన్16.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్ :** పొదలకూరు పట్టణంలోని మారుతీనగర్‌లో వెలసి ఉన్న శ్రీ వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి అనంతర వారోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు.గత దశాబ్ద కాలంగా హనుమజ్జయంతి అనంతరం వరుసగా 13 మంగళవారాలు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో అయిదవ మంగళవారం ఉత్సవాలను పొదలకూరు మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పార్చనలు, ఆకు పూజలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాంజనేయులు, అర్చకులు వేణు కుమార్ స్వాములు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది.ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు అన్నదానంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సేవా సంఘం సభ్యులు స్వయంగా భక్తులకు సేవలందించడం విశేషంగా నిలిచింది.సాయంత్రం నిర్వహించిన స్వామివారి గ్రామోత్సవం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యుద్దీపాల అలంకరణల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో మారుమోగించారు. గ్రామోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన నాదస్వర కచేరి భక్తులను ఆకట్టుకుంది. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలకు మరింత శోభ తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.అలాగే గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.భక్తి, సేవా భావం, సాంప్రదాయ సంస్కృతుల సమ్మేళనంగా నిర్వహించిన ఈ హనుమజ్జయంతి అనంతర ఉత్సవాలు మారుతీనగర్‌లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి.





# ఆకువీడు ఘటనపై కావలిలో నేడు నిరసన ర్యాలీ

**పాల్గొననున్న మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్**

**పెద్ద ఎత్తున దళిత, క్రైస్తవ, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తరలి రండి**

**పిలుపునిచ్చిన డా. మైనం పాటి ఏసురత్నం**



**కావలి,జూన్16.అక్షర టైమ్స్ :** ఆకువీడు ఘటనపై చోటు చేసుకున్న పరిణామాలపై కావలిలో బుధవారం నిరసన ర్యాలీ, సభ జరగనున్నట్లు జై భీమ్ రావ్ భారత్(జెబిపి) పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, కావలి నియోజకవర్గం ఇన్చార్జి డా. మైనంపాటి ఏసురత్నం పిలుపునిచ్చారు. మంగళవారం కావలి ట్రంక్ రోడ్ రామమూర్తి పేట (ఆర్డీవో కార్యాలయం ఎదురు)లోని నియోజకవర్గం జెబిపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 17వ తేదీ బుధవారం సాయంత్రం 4గంటలకు జెబిపి వ్యవస్థాపకులు మాజీ న్యాయమూర్తి హైకోర్టు అడ్వకేట్ జడ శ్రావణ్ కుమార్ విచ్చేయుచున్నట్లు తెలిపారు. కావలి భాష్యం స్కూల్ వద్ద నుంచి సాయంత్రం నాలుగు గంటలకు ర్యాలీ ప్రారంభించి పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని, సభ నిర్వహించనున్నట్లూ తెలిపారు. ఈ సందర్భంగా జడ శ్రావణ్ కుమార్ దళిత క్రైస్తవులు, బడుగు బలహీన వర్గాల వారికి జరుగుతున్న అన్యాయాలపై మాట్లాడతారని తెలిపారు. కనుక పెద్ద సంఖ్యలో పాల్గొనాలి అని పిలుపు ఇచ్చారు. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర కూటమి ప్రభుత్వం క్రైస్తవులపై అన్యాయంగా కేసులు పెట్టడం, హింసించడంపై నిరసిస్తూ దళిత క్రైస్తవ మహాసభ, సమావేశం నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో క్రైస్తవులకు అండగా జడ శ్రావణ్ కుమార్ నాయకత్వంలో జూన్ 28వ తేదీన ఏలూరు పట్టణంలో దళిత క్రైస్తవ శంఖారావం నిర్వహించ నున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందస్తుగా సన్నాహక సభ మొట్టమొదటిగా జెపిపి ఆధ్వర్యంలో కావలి పట్టణం ఆఫీసు వద్ద సమావేశం జరగనున్నట్లు తెలిపారు. క్రైస్తవులపై జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సమాజంలో సంఘ కాపరులు, సువార్తికులు, ఆసక్తి కలిగిన యువత దళిత, క్రైస్తవ సంఘాలు వారు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 17వ తేదీ బుధవారం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు ర్యాలీ సభ కార్యాలయ ప్రాంగణం వద్ద జరగనున్నట్లు, ప్రతి ఒక్కరూ గమనించి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మైనంపాటి జగదీష్, ఉయ్యాల నరేంద్ర,, ఏ మాల్యాద్రి, టి పురుషోత్తం, భూషణం తదితరులు ఉన్నారు.

# శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న మారబోయిన రవి యాదవ్





**శేరిలింగంపల్లి,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో ఈరోజు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ యువ నాయకులు మారబోయిన రవి యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ నెల 23వ తేదీన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అధ్యక్షతన జరగనున్న పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి సన్నాహకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**ప్రధానాంశాలపై విస్తృత చర్చ:**

ఈ సందర్భంగా సమావేశంలో పలు కీలక అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు:పార్టీ బలోపేతం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం.సభ్యత్వ నమోదు: రాబోయే రోజుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లడం.ప్రజా సమస్యలు: నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అండగా నిలవడం.భవిష్యత్తు కార్యాచరణ: రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టబోయే ప్రజా పక్ష కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేయడం.

**సమన్వయంతో ముందుకు వెళ్తాం:**

ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ మరియు ఇతర ముఖ్య నాయకులు మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత శక్తివంతమైన శక్తీగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా, పూర్తి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ పిలుపు మేరకు జరగబోయే రాబోయే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.ద

# సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి

**ఇప్పటికే సొంత భవనం నిర్మాణం చేసి ఇచ్చాం**

**మందుముల పరమేశ్వర్ రెడ్డి**








**ఉప్పల్,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** ఉప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్నారని గుర్తు చేశారు.ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు.సీనియర్ సిటిజన్స్ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.ఉప్పల్ లో ఉన్న సీనియర్ సిటిజన్స్ కోసం స్థలాన్ని కేటాయించడంతో పాటు భవనాన్ని సైతం నిర్మాణం చేసి ఇచ్చామన్నారు.రానున్న కాలంలో సీనియర్ సిటిజన్స్ కోసం పని చేసేందుకు, అన్ని వేళల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల రామ్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్ , ఉపాధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి , మనోహర్ ,సంయుక్త కార్యదర్శిలు నరసింహారెడ్డి , లింగారెడ్డి ,ఆర్గనైజింగ్ సెక్యూరిటీలు విజయ రావు , సల్ల మల్లారెడ్డి , సలహాదారు, మేకల వెంక రెడ్డి , షమీర్పేట్ యాది రెడ్డి , షమీర్పేట్ ధర్మ రెడ్డి , గోనె ప్రభాకర్ రెడ్డి , గోనె అర్జున్ రెడ్డి ,శ్రీనివాస్ , జ్ఞానేశ్వర్ రావు, మెంబర్స్, మందుముల అంజి రెడ్డి , లక్ష్మీనరసయ్య, పాండురంగమ్మ , వీరేశం , కుమార స్వామి , రామయ్య గౌడ్, ఐలయ్య , స్నేహ , కృష్ణారెడ్డి , బుచ్చి రెడ్డి , బిక్షపతి , రఘురామయ్య , నారాయణ , పాపి రెడ్డి , సత్యనారాయణ , రామ్ రెడ్డి , వెంకటేశ్వర , వెంకటమ్మ , సుశీల , సంధ్య రేఖ శ్రీవాణి, ఇందిరా, స్వరూపారాణి, అనసూయ, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, కర్ణాకర్ రెడ్డి ,సుంకు శేఖర్ రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి,బజార్ నవీన్, ప్రశాంత్ రెడ్డి, రంగుల శేఖర్, పాల్గొన్నారు.

# రైతు బిడ్డ.. ఇక డాక్టరేట్.!

**పేదరికంపై గెలిచిన పట్టుదల..**

**మహమ్మదాపురం ముద్దుబిడ్డకు డాక్టరేట్.!**

**సవాలక్ష ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. సడలని సంకల్పంతో పీహెచ్‌డీ సాధన.!**

**నిరుపేద వ్యవసాయ కుటుంబం నుండి.. కాకతీయ విశ్వవిద్యాలయం పీహెచ్డీ వరకు.!**



**పెన్‌పహాడ్,జూన్16.అక్షర టైమ్స్ :** రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద వ్యవసాయ కుటుంబం. నలుగురు అక్కాచెల్లెళ్ల బాధ్యత. చదువుకోవడానికి సవాలక్ష ఆర్థిక ఇబ్బందులు. ఇలాంటి ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, పట్టు వదలకుండా శ్రమించి గణితశాస్త్రంలో అత్యున్నతమైన పీహెచ్‌డీ సాధించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన బందు ఉప్పలయ్య. ఒక సాధారణ పల్లెటూరి బాలుడి నుండి 'డాక్టర్ బందు ఉప్పలయ్య'గా ఆయన ఎదిగిన తీరు నేటి యువతకు ఎంతో ఆదర్శంగా నిలుస్తోంది.కష్టాల కోటను దాటి.. పెన్‌పహాడ్ మండలం మహమ్మదాపురం గ్రామానికి చెందిన బందు సత్యమయ్య, లింగమ్మలది సాధారణ రైతు కుటుంబం. అయినా కొడుకును ఉన్నత విద్యావంతుడిని చేయాలనేది ఆ తల్లిదండ్రుల ఆశ. సొంత ఊరిలోనే ప్రాథమిక విద్య, పెన్‌పహాడ్ జడ్.పి.హెచ్.ఎస్ లో ప్రభుత్వ చదువు చదివిన ఉప్పలయ్య సూర్యాపేటలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, గణితంపై ఉన్న ఇష్టంతో వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో పీజీ సీటు సాధించారు.లక్ష్యం వైపు అడుగులు..పీహెచ్‌డీ రీసెర్చ్ అంటే ఎంతో ఓపిక, త్యాగంతో కూడుకున్న పని. ఎన్నో రాత్రిళ్లు నిద్రలేకుండా, మరెన్నో వైఫల్యాలను తట్టుకుంటూ ఉప్పలయ్య తన పరిశోధనను సాగించారు. తండ్రి పడే కష్టం, తల్లి చూపించే ప్రేమ, నలుగురు సోదరీమణుల నమ్మకాన్ని గుండెల్లో నింపుకొని పగలు, రాత్రి కష్టపడ్డారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఆయన భార్య స్వాతి అందించిన సహకారం, ప్రోత్సాహం ఉప్పలయ్యకు కొండంత అండగా నిలిచాయి. కుటుంబ బాధ్యతలను పంచుకుంటూ, ఆయన లక్ష్య సాధనలో ఆమె నిరంతరం తోడుగా నిలిచారు. చివరకు భార్య, కుటుంబ సభ్యుల మద్దతుతో తన కఠోర శ్రమను జోడించి మ్యాథమెటిక్స్‌లో డాక్టరేట్ సొంతం చేసుకుని, తన కలను నిజం చేసుకున్నారు.ఒక సాధారణ రైతు బిడ్డ ఈ స్థాయికి చేరడంతో మహమ్మదాపురం గ్రామం నేడు గర్వంతో ఉప్పొంగిపోతోంది. "మన ఊరి బిడ్డ డాక్టరేట్ సాధించాడు" అంటూ గ్రామస్తుల సంతోషం. పేదరికం చదువుకు అడ్డంకి కాదని, సంకల్పం ఉంటే అసాధ్యమైనది ఏదీ లేదని నిరూపించిన డాక్టర్ బందు ఉప్పలయ్య ప్రయాణం, ప్రతి గ్రామీణ విద్యార్థికి ఒక నిలువెత్తు స్ఫూర్తి.

# “ ఈ రెండు జిల్లాలే తెలంగాణకు ఊపిరితిత్తులు ”

**ఈ జిల్లాలో ఒక శాతమూ అడవుల్లేవ్!**

**రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో అసమానతలు**

**0.15 శాతం అడవులను కలిగి ఉన్న కరీంనగర్**

**హైదరాబాద్‌లో అటవీ సంపద ఆందోళన కలిగించడానికి కారణమేంటంటే**



అడవులతోనే మానవాళికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎన్నో జబ్బులకు ఔషధాలను అటవీ సంపద అందిస్తుంది. అంతేనా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందిస్తుంది. వన్యప్రాణులకైతే అడవే ఆధారం. అలాంటిది రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో భారీగా అసమానతలు కనిపిస్తున్నాయి. ములుగు జిల్లా అడుగడుగునా పచ్చదనంతో కళకళలాడుతోంది. కొత్తగూడెంలో భారీ విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ప్రస్తుతం ఈ రెండు జిల్లాలే ‘తెలంగాణకు ఊపిరితిత్తులు’ గా మారాయి. కానీ గద్వాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి జిల్లాల్లో మాత్రం పచ్చదనం కోసం వెతుక్కోవాల్సి వస్తుంది.రాష్ట్రం భౌగోళిక విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 24.05 ఉందని అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన తాజా నివేదికలో తెలిపింది. భూభాగం అటవీ ప్రాంతంలో 71.82 శాతం విస్తీర్ణంలో ములుగు జిల్లా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60.95 శాతం అడవులు ఉన్నాయి. నది పరీవాహక ప్రాంతంలో, రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్ కర్నూల్ జిల్లాలు గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోనివే.హైదరాబాద్ వంటి నగరాల్లో ఆధునిక జీవన విధానం, జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ వల్ల ఎక్కువగా అడవులు క్షీణించిపోతున్నాయి. వాటిని పూర్తిగా లేకుండా చేస్తున్నారు. రాజధాని హైదరాబాద్ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 0.08 శాతం మాత్రమే అటవీ ప్రాంతంగా ఉంది. కరీంనగర్ పరిస్థితి మరింత ఘోరం. ఇక్కడ అటవీ విస్తీర్ణం 0.15 శాతం అంటే ప్రతి వెయ్యి ఎకరాల భూభాగంలో 1.5 ఎకరం మాత్రం అటవీ ప్రాంతం ఉంది. కరీంనగర్‌లో అటవీ ప్రాంతం ఎంతలా దౌర్భాగ్య స్థితిలో ఉందో అంచనా వేసుకోవచ్చు. రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణం 1,12,122 చ.కి.మీ. ఉంది. ఇందులో అటవీ ప్రాంతం 27,688 చ.కి.మీ. ఉంది. విస్తీర్ణంలో అత్యధికంగా ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం. ఇది 4,311.38 చ.కి.మీ ఉంటుంది. అత్యల్పంగా ఉన్న జిల్లా హైదరాబాద్. ఇది 1.45 చ.కి.మీ. ఉంటుంది.అడవులు ప్రతి రాష్టంలో ఉండాల్సినంత విస్తీర్ణంల ఉండాలి. లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనవల్సి ఉంటుంది. వర్షపాతం సరిగ్గా ఉండదు. వానలు కురవక, పంటలు పండక ప్రజలు కరవుతో అల్లాడిపోతారు. పశుపక్ష్యాదులకు ఆధారం ఉండదు. భూగర్భజలాలు ఎండిపోతాయి. దీంతో వాతావరణం సమతుల్యతను కోల్పోతుంది. ఎండ తీవ్రత పెరిగిపోతుంది. చల్లదనం బాగా తగ్గిపోతుంది. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. జంతువులన్నీ మనుషులు ఉండే ప్రదేశాలకు వస్తాయి. ప్రజలు భయంకర జంతువులతో భిక్కుభిక్కుమంటూ బతకాల్సి వస్తుంది. అందువల్ల చెట్లని పెంచడం, అడవి సంపదను రక్షించడం ఎంతో అవసరం.

# తెలంగాణలో ఏసీబీ మరో రైడ్

**బెడ్ కింద భారీగా నోట్ల కట్టలు**

**ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి నివాసంలో ఏసీబీ సోదాలు**

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసు**

**ఛత్రినాకలో నరహరి నివాసం, కార్యాలయంలో ఏసీబీ సోదాలు**

**11 ప్రాంతాల్లో తనిఖీలు**



ఇటీవల దూకుడు ప్రదర్శిస్తున్న తెలంగాణ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రాష్ట్రవ్యాప్తంగా లంచాలు తిన్న తిమింగాళాలకు ఉచ్చు బిగిస్తుంది. తాజాగా హైదరాబాద్‌లో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసంలో సోదాలు చేస్తోంది. ఇప్పటి వరకు రూ. 1.10 కోట్ల నగదు, భారీగా బంగారం, వెండి ఆభరణాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా ఈ తనిఖీలు కొనసాగిస్తున్నారు.సుంకరి నరహరి, అతడి సోదరుడి ఇళ్లల్లో భారీగా ఆస్తిపత్రాలను స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, హైదరాబాదులో ఖరీదైన ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు గుర్తించారు. రంగారెడ్డి జిల్లాలో భారీగా వ్యవసాయ భూములను గుర్తించారు. రెండు బ్యాంకు లాకర్లు, చెక్కులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

# మహబూబాబాద్ జిల్లాలో దారుణం

**అల్లుడిని రాడ్‌తో కొట్టి చంపిన మామ**

**మద్యం తాగి కుమార్తెను వేధిస్తున్నాడని అల్లుడిని హత్య చేసిన మామ**

**రాడ్‌తో కొట్టి హత్య చేసిన మామ**

**ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టిన కేసముద్రం పోలీసులు**



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నరేశ్(35), గత కొంత కాలంగా మద్యానికి బానిసై తన భార్యను తీవ్రంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య పుట్టింటికి వెళ్లి నరేశ్‌పై కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది.నరేశ్‌ది తన అత్తగారి ఊరు ఒకటే కావడంతో అక్కడికి వెళ్లి భార్య, అత్త, మామలతో ఘర్షణకు దిగాడు. దీంతో ఆగ్రహావేశాలతో నరేశ్ మామ ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. దీంతో నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధుమిత్రుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

**ఇంద్రకీలాద్రిపై వేగంగా అభివృద్ధి పనులు**

**దుర్గమ్మ ఆలయంలో వేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు**

**భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేస్తున్న ఆలయ కమిటీ**

**మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రూ. 82 కోట్ల బడ్జెట్‌తో పనులు**



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయ స్వరూపం త్వరలోనే పూర్తిగా మారనుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ. 82 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ చారిత్రాత్మక మార్పుల ద్వారా దుర్గమ్మ దర్శన అనుభవం సంపూర్ణంగా మారనుంది. బెజవాడ కొండపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఆరు అంతస్తుల ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాదం కాంప్లెక్స్ పనులు చాలా వరకూ పూర్తి అయ్యాయి. మాస్టర్ ప్లాన్‌లో కీలకమైన రూ. 13 కోట్ల నిర్మిస్తున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ వల్ల కిలోమీటర్ల మేర రోడ్లపై వేచి ఉండే ఇబ్బందులు తప్పనున్నాయి.ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, పసిపిల్లలతో వచ్చే తల్లుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా కొండపైకి చేరుకుని దర్శనం చేసుకునేలా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు అమ్మవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, పంపిణీని మెరుగుపరిచేందుకు రూ. 27 కోట్ల వ్యయంతో ఆరు అంతస్తుల భారీ ప్రసాదం పోటు భవనాన్ని నిర్మిస్తున్నారు. అత్యాధునిక ఆటోమేటెడ్ మిషన్లతో పరిశుభ్రమైన వాతావరణంలో లడ్డూలను తయారు చేస్తారు.దీనివల్ల రద్దీ రోజుల్లో కూడా భక్తులకు ప్రసాదాల కొరత రాకుండా ఉండేందుకు అధికారులు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఎంతోకాలంగా కొండపై ఉన్న పార్కింగ్ కష్టాలనూ తీర్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. భవిష్యత్తులో భక్తులెవరికీ ఇబ్బంది లేకుండా గంటలోనే దర్శనం ముగించుకునేలా ఈ ప్రాజెక్టులు చేపట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కేశఖండనశాలను విశాలంగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు.ఈ వర్షాకాలంలో ఆలయం సమీపంలో కొండచరియలు విరిగిపడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని ఈవో శీనానాయక్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై పనులన్నీ పూర్తైతే భక్తులకు మరిన్ని వసతులు అందుబాటులో వస్తాయని ఆలయ అధికారులు చెబుతున్నారు.“బెజవాడ కొండపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. అమ్మవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, పంపిణీని మెరుగుపరిచేందుకు రూ. 27 కోట్ల వ్యయంతో ఆరు అంతస్తుల భారీ ప్రసాదం పోటు భవనాన్ని నిర్మిస్తున్నాం. అది జులై చివరి నాటికి మహా మండపం ముందు అన్నదానం భవనాన్ని పూర్తి చేయనున్నాం. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. కొద్దిమేర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిని సైతం త్వరలోనే పూర్తి చేయనున్నాం. అదే విధంగా వృద్ధులు, వికలాంగులు, పసిపిల్లలతో వచ్చే తల్లుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా కొండపైకి చేరుకుని దర్శనం చేసుకునేలా అన్ని రకాలైన ఏర్పాట్లు చేస్తున్నాం.

# సర్ ప్రక్రియపై సందేహాలు ఉన్నాయా - సమాధానాలు ఇవే!

**రాష్ట్రంలో ఈనెల 25 నుంచి ప్రారంభంకానున్న ప్రత్యేక సమగ్ర సవరణ**

**ఓటర్లు తరచూ అడుగుతున్న ప్రశ్నలకు సర్ అధికారుల సమాధానాలు**

**ఈసీ నుంచి ప్రకటన, సర్ ప్రక్రియపై సందేహాలు**



రాష్ట్రంలో ఈనెల 25 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే అన్నీ ఏర్పాట్లు అయ్యాయి. కానీ దీనిపై ఓటర్లలో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సర్‌పై రాజకీయ పార్టీల నుంచి కూడా కొన్ని విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఓటర్లు తరచూ అడుగుతున్న ప్రశ్నలకు సర్ అధికారులు సమాధానమిచ్చారు. దీనికి సంబంధించి సోమవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఓటర్ల ప్రశ్నలకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఇచ్చిన సమాధానలు ఇవే.ఓటర్లు వలస వెళ్లడం లేదా మృతి చెందటం అలాగే మరో చిరునామాకు మారడం వంటి వాటిపై సమగ్ర సర్వే జరుపుతారు. ఆ తర్వాత అర్హులైన వారిని మాత్రమే ఉంచి, అనర్హులను తొలగిస్తారు. దీనినే సర్ ప్రక్రియ అంటారు. మరి దీనిని ఈసారి ఏ పద్ధతిలో నిర్వహిస్తున్నారనే దానిపై అధికారులు మరింత స్పష్టంగా వివరించారు.ఈసారి సర్ ప్రక్రియలో ఈ ఎన్యూమరేషన్ పత్రాలే ముఖ్యమైనవి. దీని ద్వారానే అధికారులు వివరాలను పరిగణనలోకి తీసుకుంటారు. అందుకోసం బీఎల్‌వోలు ప్రతి ఇంటికి మూడు సార్లు వస్తారు. ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ పత్రాలను అందించి వాటిని ఎలా నింపాలో కూడా తెలియజేస్తారు. వాటిని నింపాక ఒకటి బీఎల్‌వో తీసుకుంటారు. మరొకటి రశీదుగా ఇస్తారు. ఈ ప్రక్రియను ఆన్‌లైన్‌లో కూడా చేయొచ్చని అధికారులు తెలిపారు. ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ లోకి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపొచ్చు.సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఓటరు గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న మొబైల్ నంబరు లేదా ఎపిక్ కార్డు నంబర్‌ను ఉపయోగించి పోర్టల్‌లోకి లాగిన్ కావాలి. కాగనే ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయటంతో ఫుల్ ఎన్యూమరేషన్ ఫామ్ అని కనిపిస్తుంది. దానిపైన క్లిక్ చేసి వివరాలను ఎంటర్ చేయాలి. ఈ సౌకర్యం కేవలం ఓటరు జాబితాలోని పేరు, వారి ఆధార్ కార్డులోని పేరుకు సరిపోయిన వారికే ఉంటుంది.ఒకవేళ బీఎల్‌వో ఇంటికి రాకపోయినా, ఎన్యూమరేషన్ పత్రాన్ని అందించకపోయినా ఓటర్లు వెంటనే వెబ్‌సైట్‌లో బీఎల్‌వో నంబరు ఉంటుంది. ఫోన్ చేసి సంప్రదించవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్(బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో) ద్వారానూ సంప్రదించవచ్చు. బీఎల్‌వో ఇంటికి వచ్చినప్పుడు ఓటరు లేకపోతే కుటుంబంలో మేజర్ అయిన సభ్యుడికి పత్రాన్ని ఇచ్చి వివరాలను తీసుకుంటారు. అలాగే కుటుంబంలోని ఓ ఓటరు ఇతర ప్రాంతాల్లో పని చేస్తుంటే అతని పత్రాన్ని కుటుంబ పెద్దకు అందించి నమోదు చేసుకుంటారు.ఎన్యూమరేషన్ పత్రంలో ఏవైనా సవరణలు కావాలంటే కొత్త ఫారాన్ని అందించే నిబంధన లేదు. అందుకే బీఎల్‌వోలు మొదటిసారి పత్రం ఇచ్చినప్పుడే ఏ విధంగా పూరించాలో స్పష్టంగా చెప్తారు. మళ్లీ సందేహాలు ఉన్నా రెండోసారి వివరిస్తారు. అయినా తప్పులు జరిగితే ఆ పత్రంలోనే సవరించి మరోసారి వివరాలను స్పష్టంగా నమోదు చేయవచ్చు.ఎస్ఐఆర్-2002 ఓటర్ల జాబితాలో మీ పేరు ఉందా లేదా అని కనుక్కోవడానికి ఈ కింది విధంగా చేయాలి. ముందు కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన https: voters.eci.gov.in లేదా https: //ceotelangana.nic.in పోర్టల్‌లోకి వెళ్లాలి. ఆ తర్వాత సెర్చ్ బై ఎలక్టర్స్ డీటెయిల్స్’ ఆప్షన్ క్లిక్ చేయాలి. అక్కడ పార్టీలవారీగా ఓటర్ల జాబితా సమాచారం పీడీఎఫ్ రూపంలోనూ అందుబాటులో ఉంటుంది. అలా వివరాలను తెలుసుకోవచ్చు.సర్ 2002 జాబితాలో పేరు లేదంటే, ఆ సమయంలో వారు ఓటరుగా నమోదు కాలేదని అర్థం. అటువంటి సందర్భాలలో, వారి తల్లిదండ్రులు/తాతనానమ్మల ఓటింగ్ వివరాలను సేకరించి, గణన ఫారంలోని సంబంధిత కాలమ్‌లో నింపవచ్చు. ఇందుకోసం, బూత్ స్థాయి అధికారి సహాయం తీసుకోవచ్చు.ఒకవేళ ఓటరు కొత్త ప్రాంతానికి మారితే, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత వారు తమ చిరునామాను మార్చుకోవచ్చు. ఇందుకోసం, వారు ఫారం-8 ద్వారా ఈఆర్వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తులను జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు పరిశీలించి, మార్పులను తుది జాబితాలో చేర్చుతారు. అలాగే ఎన్యూమరేషన్ ఆధార్ నంబర్ అడుగుతారు. కానీ ఇది తప్పనిసరి కాదు. ఈ ఫారంలో కేటాయించిన స్థలంలో ఈ మధ్యకాలంలో దిగిన ఫొటోను అతికించాలి.18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటరు సర్‌లో భాగంగా తన పేరును జాబితాలో చేర్చడానికి దరఖాస్తు చేసుకోవచ్చా : కొత్త ఓటరు రిజిస్ట్రేషన్ కోసం డిక్లరేషన్ ఫారంతో పాటు బీఎల్‌వో జారీ చేసిన ఫారం-6ను కూడా నింపాలి. ఈ పత్రాలు బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంటాయి. వీటిని జూలై 31 నుండి ఆగస్టు 30 మధ్య పరిశీలిస్తారు. ఈఆర్వో తుది నిర్ణయం తీసుకుంటారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండే కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.ఆన్‌లైన్‌లో లేదా మరెక్కడైనా ఓటర్ల నమోదు ఫారమ్‌ను నింపేటప్పుడు మీకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే, మీరు ఓటర్ల టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1950 ని సంప్రదించవచ్చు. లేదా ఈసీఐనెట్ యాప్‌లోని ‘బుక్ ఎ కాల్ విత్ బీఎల్‌వో’ సదుపాయాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఒకవేళ ఓటరు వారి కుటుంబ సభ్యులు గ్రామంలో అందుబాటులో లేకపోతే, వారు ఎన్యూమరేషన్ పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించి, ఆ గ్రామ చిరునామాతో దరఖాస్తు చేసుకోవచ్చు.ఓటరు ఎవరైనా ఎన్యూమరేషన్ పత్రం తీసుకుని తిరిగి ఇవ్వకపోతే గైర్హాజరు, మృతి చెందడం, వేరే ప్రాంతానికి వెళ్లిపోవడం లేదా రెండు చోట్ల ఓటు ఉండడం వంటి వివరాలపై బీఎల్‌వోలు ఆరా తీస్తారు. తర్వాత వీరి పేర్లు ముసాయిదా జాబితాలో ప్రచురించరు.ఎన్యూమరేషన్ పత్రంతో పాటు ఏ గుర్తింపు కార్డులను సమర్పించాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఏవైనా తేడాలు ఉన్నట్టు గమనిస్తే వారికి ఈఆర్వో నోటీసులు జారీ చేస్తారు. ఆ నోటీసు అందిన తర్వాత సంబంధిత వ్యక్తి ఈ కింది పత్రాల్లో ఒకటి అందించాలి.

# ఇంటర్‌ఛేంజ్ లేకుండానే విజయవాడ-హైదరాబాద్ రహదారి

**ఇంటర్‌ఛేంజ్ లేకుండానే విజయవాడ-హైదరాబాద్ హైవే విస్తరణ డీపీఆర్**

**విజయవాడ బైపాస్ క్రాస్‌చేసే గొల్లపూడి వద్ద రౌండ్ ఎబౌట్‌తో సరిపెట్టేసిన వైనం**

**ఫలితంగా భవిష్యత్‌లో గందరగోళంగా మారనున్న కూడలి**




విజయవాడ బైపాస్ నిర్మాణ డిజైన్‌లో గతంలో ఎటువంటి తప్పులు చేశారో, ప్రస్తుతం విజయవాడ-హైదరాబాద్ హైవే విస్తరణ డీపీఆర్‌లో కూడా అటువంటి తప్పులే చేశారు.ఎందుకంటే ముఖ్యంగా రెండు జాతీయ రహదారులు క్రాస్ అయ్యేచోట వాహనాలు ఏ మార్గంలో నుంచి అయినా, సులువుగా మరొక మార్గంలోకి మారేందుకు వీలుగా డిజైన్ రూపొందించాల్సి ఉంది. కానీ ఏదో మొక్కుబడిగా చిన్న రింగ్ వంటి దాన్ని నిర్మించి సరిపెడుతున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో వాహనదారులు గందరగోళానికి గురికావడంతో పాటు తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలెన్నో ఉత్పన్నయమ్యే అవకాశాలు లేకపోలేదు.విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్ 65 ని 231 కిలోమీటర్ల నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలుగా విస్తరించనున్నారు. దీనికి సంబంధించి రూ.10,680 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్‌ను సిద్ధం చేశారు. గొల్లపూడి వద్ద ఈ హైవేను క్రాస్‌చేసి విజయవాడ బైపాస్ వెళ్తుంది. ఇక్కడ క్లోవర్ లీఫ్ ఇంటర్ ఛేంజ్‌ను సైతం నిర్మించాల్సి ఉంది. ఎందుకంటే విజయవాడ-హైదరాబాద్ హైవే ఆరు వరుసలుగా విస్తరణ కావడం, విజయవాడ బైపాస్ ఇప్పటికే ఆరు వరుసలుగా నిర్మించడంతో ఆ కూడలిలో వాహనాలకు అ విధమైన ఇబ్బంది లేకుండా ఇంటర్ ఛేంజ్ అనేది ఉండాలి. దీనివల్ల హైదరాబాద్, విజయవాడ, ఏలూరు, కాజ వైపు ఎటు వెళ్లినా సరే వాహనాలు సులువుగా వెళ్లేందుకు వీలుగా ఉంటుంది.అయితే గొల్లపూడి వద్ద ఇంటర్ ఛేంజ్ లేకుండా డీపీఆర్‌ను సిద్ధం చేసి, కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖకు పంపారు. క్లోవర్ లీఫ్ ఇంటర్‌ఛేంజ్‌కు దాదాపు 65 ఎకరాలు అవసరం కావడంతో భూసేకరణ కష్టమవుతుందని సాకుగా చూపించి ఈ ప్రతిపాదనను తొలగించారు. ప్రస్తుతం విజయవాడ-హైదరాబాద్ హైవేలో విజయవాడ బైపాస్ క్రాస్ అయ్యేచోట రౌండ్ ఎబౌట్ నిర్మిస్తున్నారు. అక్కడ వాహనాలు మలుపులు తిరిగేలా చూడనున్నారు. అయితే అది చాలా ఇరుకుగా ఉంది.దాంతో రోబోయే రోజుల్లో విజయవాడ-హైదరాబాద్ హైవే ఆరు వరుసలుగా విస్తరణ జరిగాక వాహన రద్దీ పెరిగి, మరింత ఇరుకుగా మారుతుంది. ప్రస్తుతం విజయవాడ-హైదరాబాద్ హైవేపై విజయవాడ బైపాస్ వెళ్లేందుకు లెవెల్-1 వంతెన ఉంది. దానిపై నుంచి విజయవాడ-హైదరాబాద్ వాహనాలు నేరుగా రాకపోకలు సాగించేందుకు మరో వంతెన నిర్మాణానికి కూడా ఆలోచన చేయడం లేదు. గతంలోనూ విజయవాడ బైపాస్ డిజైన్ రూపొందించినప్పుడు కూడా పలు కూడళ్ల వద్ద ఎదురయ్యేటటువంటి సవాళ్లను పట్టించుకోకపోవడం గమనార్హం.

# 10 రోజులైనా వీడని మిస్టరీ

**చిన్నారి జ్ఞానేశ్వరి జాడ తెలిసేదెలా**

**అదృశ్యమైన చిన్నారి కోసం గాలింపు**

**జూన్ 6న పెంపుడు కుక్కతో కలిసి కనిపించకుండా పోయిన జ్ఞానేశ్వరి**



రెండేళ్ల చిన్నారికి ఏమైందో ఎలా అదృశ్యమైందో 10 రోజులుగా వందలాది మంది పోలీసులు గాలిస్తున్నా, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతున్నా, ఒక్క క్లూ దొరక్కపోవడం ఏమిటి అసలేం జరిగిందో తెలియడం లేదు. కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారానికి చెందిన జ్ఞానేశ్వరి (జానూ) అదృశ్యం కాగా 10 రోజులైనా ఆచూకీ లేదు. దేనిపైనా స్పష్టత లేక మిస్టరీగా మారింది. పోలీసులకు సవాల్‌గా మారిన ఘటనపై ప్రభుత్వం దృష్టి సారించింది. చిన్నారి అదృశ్యమైన తోట, కొండ ప్రాంతాన్ని అటవీ, పోలీసు, ఎన్డీఆర్ఎఫ్, ఇతర బలగాలు జల్లెడ పడుతూనే ఉన్నాయి. ఇక్కడ జంతువులు తిరుగుతున్న ఆనవాళ్లు కూడా లేవు.మరోవైపు సీసీ కెమెరాలు, ఫోన్ కాల్స్, ఇతర సాంకేతికత ద్వారా చిన్నారి ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరంగా జరుగుతోంది. దర్యాప్తుపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సోమవారం సమీక్షించారు. తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. చిన్నారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అధికారులతో సమీక్షించారు.చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం తర్వాత అన్ని కోణాల్లో విస్తృత స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి సాంకేతిక ఆధారాలు కానీ, ఇతర క్లూలు కానీ లభ్యం కాలేదని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో అడవి జంతువుల సంచారం వల్ల కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అయితే, చిన్నారి అదృశ్యమైన పరిస్థితులను బట్టి చూస్తే ముందస్తు ప్రణాళికతో ఎవరైనా కిడ్నాప్ చేశారని అనుకోలేమని స్పష్టం చేశారు. కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే ఇదంతా జరిగిందని, పాప తనకు తానే నడిచి వెళ్లిందని తల్లిదండ్రులు చెబుతున్నట్లు వివరించారు.సమాచారం అందిన వెంటనే గాలింపు చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. ఒంటరిగా వెళ్తున్న పాపను చూసి ఎవరైనా తీసుకువెళ్లారా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నామని, అయితే దీనిపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదని అన్నారు. హఠాత్తుగా ఏదో జరిగి ఉండవచ్చని, ఈ ఘటనపై కొందరు అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. చిన్నారి ఆచూకీ చెప్పినవారికి రూ.లక్ష రివార్డు అందజేస్తామని ప్రకటించారు. కాగా, అదృశ్యమైన సమయంలో చిన్నారి వెంట వెళ్లి వచ్చిన శునకం డీహైడ్రేట్ అయ్యిందని తెలిపారు. పోస్టుమార్టమ్ నివేదిక అందిన తర్వాత కేసులో తదుపరి పరిశీలన చేస్తామని అధికారులు వెల్లడించారు.“చిన్నారి కోసం 10 రోజులుగా జల్లెడపడుతున్న ఇంత వరకు చిన్న క్లూ కూడా దొరకలేదు. చిన్నారి అదృశ్యమైన ప్రాంతాన్ని పరిశీలించాం. అనంతరం అధికారులతో సమీక్షించి వివరాలు సేకరించాం. జూన్ 6న పెంపుడు కుక్కతో కలిసి జ్ఞానేశ్వరి అనే చిన్నారి కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి చిన్నారి అదృశ్యమైన తోట, సమీపంలోని కొండ ప్రాంతాన్ని అటవీ శాఖ, పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు గాలిస్తున్నాయి. అటవీ జంతువులను గుర్తించే అధునాతన నైట్ విజన్ కెమెరాలు కొండపై పలుచోట్ల అమర్చి పరిశీలిస్తున్నాం. ఫోన్ కాల్స్, ఇతర సాంకేతికత ద్వారా దర్యాప్తు ముమ్మరంగా చేస్తున్నాం. కిడ్నాప్ కోణంలోనూ అనుమానితులను ప్రశ్నిస్తున్నాం. కానీ అచూకీ మాత్రం లభ్యం కాలేదు. చిన్నారి అదృశ్యంపై అవాస్తవాలు ప్రచారం చేయవద్దు.తన బిడ్డ అదృశ్యంపై కొందరు సామాజిక మాధ్యమాల్లో పెడుతున్న వ్యాఖ్యలు తమను ఎంతో బాధిస్తున్నాయని, ఓ తల్లిగా తన బాధను అర్థం చేసుకోవాలని భవానీ ఆవేదన వ్యక్తం చేశారు. పాప అదృశ్యమై 10 రోజులు గడుస్తున్నా, తమ బిడ్డ క్షేమంగా తిరిగి వస్తుందనే ఎంతో ఆశతో, ధైర్యంతో ఉన్నామని పేర్కొన్నారు. ఆ కాస్త ధైర్యాన్ని కూడా తమకు దూరం చేయవద్దని ఆమె కోరారు. తమ పాప ఆచూకీ కోసం పోలీసులు, ఇతర అధికారులు, మీడియా ప్రతినిధులు ఎంతో సహకరిస్తున్నారు.

# "పెట్టుబడి" పెట్టాలని ఆలోచిస్తున్నారా

సరైన "మ్యూచువల్ ఫండ్" ఎలా ఎంచుకోవాలి

మార్కెట్‌లో ఉన్న వివిధ రకాల 'మ్యూచువల్ ఫండ్స్' ఇవే!

వాటి పని తీరును బట్టి సరైనది ఎంచుకోవాలంటున్న నిపుణులు!





దీర్ఘకాలిక వ్యూహంతో పొదుపు చేసేవారికి "మ్యూచవల్ ఫండ్లు" అనువైన పెట్టుబడి మార్గం. ఇవి "అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ)"ల ఆదేశాల మేరకు పని చేస్తాయి. ఈ సంస్థలు, ఒకే రకమైన పెట్టుబడి లక్ష్యాలను కలిగి ఉన్న అనేక మంది వ్యక్తులు, సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి నిధులను సమీకరిస్తాయి. ఇలా సమీకరించిన ఇన్వెస్ట్‌మెంట్స్‌ను పర్యవేక్షించడం, నిర్వహించడం అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఫండ్ మేనేజర్ల బాధ్యత. అయితే, మనలో చాలా మందికి ఈక్విటీ ఫండ్లు, డెట్ ఫండ్లు, హైబ్రిడ్ ఫండ్ల గురించి తెలిసి ఉంటుంది. కానీ, అవి మాత్రమే కాదు దేశీయ మార్కెట్‌లో అనేక ఫండ్లు ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. మరి, మార్కెట్‌లో ఉన్న వివిధ రకాల మ్యూచవల్ ఫండ్లు ఏంటి వాటి పని తీరు ఏవిధంగా ఈ స్టోరీలో తెలుసుకుందాం.స్వల్పకాలిక సెక్యూరిటీలను మనీ మార్కెట్ ఫండ్లుగా చెబుతుంటారు. ఈ ఫండ్లు ట్రెజరీ బిల్లులు, కమర్షియల్ పేపర్ వంటి రిస్క్ తక్కువ ఉన్న, స్వల్పకాలిక సెక్యూరిటీలలో పెట్టుబడి పెడతాయి.ఈ రకం ఫండ్స్ ముఖ్యంగా అధిక వృద్ధి సామర్థ్యం ఉన్న సంస్థల స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మూలధన వృద్ధిపై దృష్టి పెడతాయి. గణనీయమైన రాబడులను కోరుకునే దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇవి అనుకూలంగా ఉంటాయంటున్నారు నిపుణులు.ఇవి బాండ్లు, స్థిర-ఆదాయ సెక్యూరిటీలు లేదా డివిడెండ్ ఇచ్చే స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా క్రమమైన ఆదాయాన్ని పొందడానికి ప్రాధాన్యత ఇస్తాయి. ఇన్‌కం ఫండ్లు స్థిరమైన ఆదాయ ప్రవాహాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెబుతున్నారు. స్వల్పకాలిక రుణ సాధనాలలో పెట్టుబడి పెట్టడం ద్వారా లిక్విడిటీకి, భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి లిక్విడ్ ఫండ్లు. ఈ ఫండ్లపై రాబడి తక్కువే అయినప్పటికీ, వేగంగా నిధులు విత్‌డ్రా చేసుకోవాలనుకునే పెట్టుబడిదారులకు అనువైనవిగా ఉంటాయి. ట్యాక్స్ సేవింగ్ ఫండ్లను "ఈఎల్ఎస్ఎస్" అని కూడా పిలుస్తారు. ఇవి సెక్షన్ 80ఙ కింద ట్యాక్స్ బెనిఫిట్స్‌ను అందిస్తాయి. ఈ రకం ఫండ్లు ప్రధానంగా ఈక్విటీలలో పెట్టుబడి పెడతాయి. ట్యాక్స్ సేవింగ్ ఫండ్లకు తప్పనిసరి లాక్-ఇన్ పీరియడ్ ఉంటుంది. తక్కువ వ్యయ నిష్పత్తి వీటికి ఉన్న మరో ఆకర్షణీయమైన లక్షణం.అగ్రెసివ్ గ్రోత్ ఫండ్లు గణనీయమైన మూలధన వృద్ధిని లక్ష్యంగా చేసుకోవడంతో పాటు, మార్కెట్ నష్టాలను ఎదుర్కోవడానికి రెడీగా ఉంటాయి. దీర్ఘకాలిక దృక్పథం, రిస్క్ తీసుకునే వైఖరి ఉన్న ఇన్వెస్టర్స్‌కు అనుకూలంగా ఉంటాయి ఈ ఫండ్స్.ఇవి వివిధ రకాల పెట్టుబడుల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా పదవీ విరమణ కోసం ఒక నిధి(కార్పస్)ని సృష్టించాలని టార్గెట్‌గా పెట్టుకుంటాయి. రిటైర్‌మెంట్ తర్వాత సురక్షితమైన ఆర్థిక భవిష్యత్తు కోసం ప్రణాళిక వేసుకునే వ్యక్తులకు ఇవి యూజ్ అవుతాయి.ఇవి మార్కెట్/ఇండెక్స్ పనితీరును అనుసరిస్తాయి. తద్వారా మొత్తం మార్కెట్‌కు లేదా నిర్దిష్ట విభాగాలకు తక్కువ ఖర్చుతో కూడిన ఎక్స్‌పోజర్‌నందిస్తాయి.నిర్దిష్ట పరిశ్రమలు లేదా రంగాలపై సెక్టార్ ఫండ్లు దృష్టి పెడతాయి. తద్వారా పెట్టుబడిదారులు.. మంచి పనితీరు కనబరుస్తాయని వారు నమ్మే రంగాలను లక్ష్యంగా చేసుకోవడానికి అవకాశం కల్పిస్తాయి.ఫండ్స్ ఆఫ్ ఫండ్స్ ఇతర మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడతాయి. ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోను అందిస్తాయి. అంతర్జాతీయ లేదా విదేశీ ఫండ్లు అనేవి పెట్టుబడిదారుడి నుంచి వచ్చిన డబ్బులను దేశం వెలుపల ఇన్వెస్ట్ చేస్తాయి. తద్వారా రిస్క్‌ను వైవిధ్యపరిచి, రాబడులను పెంచే ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.దాతృత్వ విరాళాల కోసం గిఫ్ట్ ఫండ్స్‌ను రూపొందించారు. ఈ ఫండ్స్ దాతలకు ట్యాక్స్ బెనిఫిట్స్ అందిస్తూనే, వారి మంచి పనులకు సపోర్ట్ అందిస్తాయి.మ్యూచువల్ ఫండ్లు, స్టాక్స్‌కు సంబంధించిన అంశాలు ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్లలో కలిసి ఉంటాయి. ఈ రకమైన ఫండ్స్ పెట్టుబడిదారులకు లిక్విడిటీని, వైవిధ్యభరితమైన ఎక్స్పోజర్‌ను అందిస్తాయి.ఇలా మార్కెట్లో అందుబాటులో ఉన్న వివిధ రకాల ఫండ్లను పోల్చి చూస్తే, "సరైన మ్యూచువల్ ఫండ్లను" ఎంచుకోవడం ఈజీ అవుతుందని చెబుతున్నారు నిపుణులు. అలాగే, మీ ఇన్వెస్ట్‌మెంట్‌ను అనుభవజ్ఞులైన ఎక్స్‌పర్ట్స్ నిర్వహిస్తారు. కాబట్టి, వాటి నుంచి బెనిఫిట్ పొందడానికి మీరు నిపుణులై ఉండాల్సిన పని లేదు. చాలా రకాల ఫండ్లకు లాక్-ఇన్ పీరియడ్ ఉండదు, అందువల్ల మీకు అవసరమైనప్పుడు మీ ఇన్వెస్ట్‌మెంట్‌ను విత్‌డ్రా చేసుకోవచ్చు. మీరు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా చిన్న మొత్తాలతో ఇన్వెస్ట్‌మెంట్ స్టార్ట్ చేసి క్రమం తప్పకుండా పెట్టుబడులను కొనసాగించొచ్చని నిపుణులు సలహా ఇస్తున్నారు.

# మే నెలలోనూ రష్యా నుంచి భారీగా చమురు దిగుమతులు

రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్

మే నెలలో రష్యా నుంచి 5.8 బిలియన్ యూరోల విలువైన ఇంధనాలను దిగుమతి చేసుకున్న భారత్

రష్యా ఇంధనాల రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్



రష్యా నుంచి భారత్‌కు భారీగా చమురు దిగుమతులు అవుతున్నాయి. మే నెలలో ఆ దిగుమతులు మరింత పెరిగాయి. సుమారు భారత్ సుమారు 5.8 బిలియన్ యూరోల (దాదాపు 6.7 బిలియన్ డాలర్లు) విలువైన చమురును కొనుగోలు చేసినట్లు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) నివేదిక తెలిపింది. దీంతో ప్రపంచంలో రష్యా ఇంధనాల రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్ కొనసాగింది.సీఆర్ఈఏ నివేదిక ప్రకారం, భారత్ దిగుమతి చేసుకున్న రష్యా ఇంధనాల్లో అత్యధిక భాగం క్రూడ్ ఆయిల్‌దే. మొత్తం దిగుమతుల్లో సుమారు 83 శాతం వాటా క్రూడ్ ఆయిల్‌ది ఉంది. దీని విలువ 4.8 బిలియన్ యూరోలుగా ఉంటుంది. అదేవిధంగా చమురు ఉత్పత్తుల దిగుమతుల విలువ 550 మిలియన్ యూరోలు కాగా, బొగ్గు దిగుమతులు 429 మిలియన్ యూరోలుగా నమోదయ్యాయి. ఇక మే నెలలో భారత్ మొత్తం క్రూడ్ ఆయిల్ దిగుమతులు నెలవారీగా 8 శాతం పెరిగాయి. ఇందులో రష్యా నుంచి వచ్చిన చమురు దిగుమతులు ఏకంగా 21 శాతం పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంది.దేశంలోని ప్రధాన రిఫైనరీ కేంద్రాల్లో రష్యా చమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. గుజరాత్‌లోని వడినార్ రిఫైనరీలో ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో రష్యా క్రూడ్ చేరికలు 36 శాతం పెరిగాయి. అదే రాష్ట్రంలోని జామ్‌నగర్ రిఫైనింగ్ సముదాయానికి వచ్చిన రష్యా చమురు సరఫరాలు 14 శాతం మేర పెరిగాయి. తగ్గింపు ధరలకు లభిస్తున్న రష్యా చమురు భారత రిఫైనరీలకు ఇప్పటికీ ఆకర్షణీయంగానే ఉందని నివేదిక పేర్కొంది. గతేడాది నవంబర్ చివర్లో రష్యా చమురు దిగుమతులను నిలిపివేసిన ప్రభుత్వ రంగ రిఫైనరీలు ఈ ఏడాది మార్చి నుంచి మళ్లీ కొనుగోళ్లు ప్రారంభించాయి. దీంతో కర్ణాటకలోని న్యూ మంగళూరు రిఫైనరీలో మే నెలలో రష్యా చమురు దిగుమతులు 13 శాతం పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రిఫైనరీలో అయితే ఈ పెరుగుదల 42 శాతానికి చేరింది. ఒడిశాలోని పరదీప్ రిఫైనరీ కూడా గత రెండేళ్లలో అత్యధిక స్థాయిలో రష్యా క్రూడ్‌ను స్వీకరించినట్లు సీఆర్ఈఏ వెల్లడించింది.ఉక్రెయిన్‌పై రష్యా దాడి అనంతరం పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షల కారణంగా ప్రపంచ ఇంధన వాణిజ్య సమీకరణాలు మారిపోయాయి. ఈ నేపథ్యంలో తగ్గింపు ధరలకు లభిస్తున్న రష్యా చమురును భారత్ పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. సీఆర్ఈఏ నివేదిక ప్రకారం, మే 2026లో రష్యా క్రూడ్ ఎగుమతుల్లో 50 శాతం వాటాను చైనా కొనుగోలు చేసింది. 36 శాతం వాటాతో భారత్ రెండో స్థానంలో నిలిచింది. తుర్కియే 6 శాతం, యూరోపియన్ యూనియన్ 5 శాతం వాటాతో తరువాతి స్థానాల్లో ఉన్నాయి.రష్యా క్రూడ్‌తో తయారైన చమురు ఉత్పత్తుల దిగుమతులపై యూరోపియన్ యూనియన్ నిషేధం విధించింది. అయినప్పటికీ, రష్యా చమురును వినియోగించే భారత్, తుర్కియే, బ్రూనై, జార్జియా రిఫైనరీల నుంచి తయారైన ఉత్పత్తులు పలు ఆంక్షలు విధించిన దేశాలకు చేరుతున్నాయని నివేదిక పేర్కొంది. మే నెలలో మాత్రమే ఈ దేశాల రిఫైనరీలు సుమారు 641 మిలియన్ యూరోల విలువైన చమురు ఉత్పత్తులను యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాలకు ఎగుమతి చేసినట్లు వెల్లడించింది. అమెరికాకు వెళ్లిన కొన్ని చమురు ఉత్పత్తులు గుజరాత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలోని జామ్‌నగర్ రిఫైనరీ నుంచి ఎగుమతి అయినట్లు సీఆర్ఈఏ పేర్కొంది. గత మూడు నెలల కాలంలో జామ్‌నగర్ రిఫైనరీ వినియోగించిన క్రూడ్‌లో సుమారు 15 శాతం రష్యా చమురేనని నివేదిక తెలిపింది.

# బంగారం కొనాలనుకునేవారికి ఊరట- భారీగా తగ్గిన రేట్లు

మంగళవారం బులియన్ మార్కెట్

ప్రారంభంలో బంగారం ధరల్లో తగ్గుదల

బంగారం కొనుగోలులో 916 హాల్‌మార్క్

మేకింగ్ ఛార్జీల పరిశీలన తప్పనిసరి



బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి మంగళవారం కొంత ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. బులియన్ మార్కెట్ ప్రారంభమైన వెంటనే పసిడి ధరల్లో తగ్గుదల నమోదైంది. వెండి ధరలు కూడా భారీగా తగ్గడంతో కొనుగోలుదారులు ఊపిరిపీల్చుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న మార్పులు, డాలర్ కదలికలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్ ప్రభావంతో విలువైన లోహాల ధరలు రోజువారీగా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి.క్యాప్స్ గోల్డ్ వెబ్‌సైట్ వెల్లడించిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర మంగళవారం రూ.1,52,780గా నమోదైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇదే బంగారం ధర రూ.1,55,470గా ఉండగా, ప్రస్తుతం దాదాపు రూ.3 వేల వరకు తగ్గింది. దీంతో ఇటీవలి రోజులుగా పెరుగుతున్న ధరలతో ఆందోళన చెందుతున్న కొనుగోలుదారులకు కొంత ఉపశమనం లభించినట్లైంది. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలోనూ ఇదే ధర కొనసాగుతోంది.అలాగే బెంగళూరు, ముంబయి వంటి ప్రధాన నగరాల్లో కూడా 24 క్యారెట్ల బంగారం ధరలు ఇదే స్థాయిలో నమోదయ్యాయి. మరోవైపు నగల తయారీలో విస్తృతంగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా తగ్గుదల బాట పట్టింది. ప్రస్తుతం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,750గా కొనసాగుతోంది. గతంతో పోలిస్తే ఈ ధరలో కూడా తగ్గుదల కనిపించడం గృహిణులు, పెళ్లిళ్ల సీజన్‌కు సిద్ధమవుతున్న కుటుంబాలకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది.బంగారంతో పోలిస్తే వెండి ధరల్లో మరింత ఎక్కువ తగ్గుదల నమోదైంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,49,650గా నమోదైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో కిలో వెండి ధర రూ.2,57,271గా ఉండగా, ఒక్కరోజులోనే దాదాపు రూ.7 వేల మేర తగ్గింది. పరిశ్రమల అవసరాలు, అంతర్జాతీయ డిమాండ్, పెట్టుబడిదారుల ధోరణి ప్రభావంతో వెండి ధరల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.బంగారం కొనుగోలు సమయంలో హాల్‌మార్క్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా 916 హాల్‌మార్క్ ఉన్న బంగారం 22 క్యారెట్ల నాణ్యతకు గుర్తుగా పరిగణించబడుతుంది. హాల్‌మార్కింగ్ ద్వారా బంగారం స్వచ్ఛతకు అధికారిక ధ్రువీకరణ లభిస్తుంది. హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలను కొనుగోలు చేయడం వల్ల వినియోగదారులు నాణ్యమైన బంగారాన్ని పొందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా భవిష్యత్తులో విక్రయించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు కూడా హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలకు మెరుగైన విలువ లభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.బంగారం ధరలు చూసి వెంటనే కొనుగోలు నిర్ణయం తీసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో ప్రకటించే ధరలు సాధారణంగా గ్రాము లేదా 10 గ్రాముల ప్రాథమిక ధరలు మాత్రమే. వినియోగదారులు చెల్లించాల్సిన తుది బిల్లులో జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు, హాల్‌మార్కింగ్ ఫీజులు, ఇతర పన్నులు కూడా జత అవుతాయి. అదే విధంగా ఒక్కో నగల దుకాణంలో మేకింగ్ ఛార్జీలు, తరుగు రేట్లు వేర్వేరుగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి కేవలం బంగారం గ్రాము ధరను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం కంటే, తుది బిల్లులోని అన్ని ఖర్చులను పరిశీలించిన తర్వాతే కొనుగోలు నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మారుతుంటాయి. అందువల్ల ఆభరణాలు లేదా పెట్టుబడి కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారు తాజా ధరలను మరోసారి ధ్రువీకరించుకోవడం మంచిది. అలాగే నాణ్యత ధ్రువీకరణ కలిగిన హాల్‌మార్క్ ఆభరణాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. ధరతో పాటు నాణ్యత, అదనపు చార్జీలు, విక్రయానంతర విలువ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే భవిష్యత్తులో నష్టాలను నివారించవచ్చని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

# త్వరలోనే అమెరికా- భారత్ ఒప్పందం!

ట్రేడ్ డీల్‌పై కీలక చర్చలు

భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందంపై ముందడుగు

వచ్చే వారం భారత్‌కు రానున్న యూఎస్ ట్రేడ్ ప్రతినిధి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ!



భారత్- అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం దిశగా కీలక ముందడుగు పడింది. అమెరికా ట్రేడ్ రెప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ ఈ నెల 22న భారత్‌కు రానున్నారు. జూన్ 23-24 తేదీల్లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌తో కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. ఇక్కడే మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ తెలిపారు. అమెరికా ప్రతినిధుల బృందం ఇప్పటికే పలుమార్లు భారత అధికారులతో చర్చలు జరిపిందని, ఇప్పుడు డీల్‌కు తుది మెరుగులు దిద్దనున్నట్లు వెల్లడించారు.అంతకుముందు జూన్ 2-4 మధ్య యూఎస్ చీఫ్ నెగోషియేటర్ బ్రెండన్ లించ్ నేతృత్వంలోని ఒక బృందం భారత్‌తో చర్చలు నిర్వహించింది. ఆ చర్చలకు కొనసాగింపుగానే ఇప్పుడు యూఎస్‌టీఆర్ జేమిసన్ గ్రీర్ భారత్‌కు వస్తున్నారు. ఈ సమావేశాల్లో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో పాటుగా భారత్ అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపైనా చర్చలు జరగనున్నాయి. ఈ ఫిబ్రవరిలోనే రెండు దేశాలు ట్రేడ్ డీల్‌కు ప్రాథమిక విధివిధానాల్ని ఖరారు చేశాయి. తర్వాత అమెరికాలో టారిఫ్ విధానాల్లో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం అమెరికా అన్ని దేశాలపైనా 10 శాతం సాధారణ సుంకం విధిస్తోంది. ఈ పరిస్థితుల్లోనే భారత్‌కు ఇతర పోటీ దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ కంటే మెరుగైన వాణిజ్య ప్రయోజనాలు ఉండేలా ఒప్పందాన్ని సవరించే అవకాశం ఉంది.భారత్‌తో పాటుగా మరికొన్ని దేశాలపై అమెరికా సెక్షన్ 301 కింద ప్రత్యేక విచారణలు నిర్వహిస్తోంది. బలవంతపు కార్మిక వ్యవస్థ అంశంపై భారత్ సహా 54 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకం విధించాలని అమెరికా ప్రతిపాదించింది. ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉందని, భారత్ తన అభిప్రాయాన్ని ఇప్పటికే అమెరికాకు తెలియజేసిందని రాజేష్ అగర్వాల్ చెప్పారు.ఇక ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం భారత్ రానున్న ఐదేళ్లలో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, విమానాలు, విమాన విడిభాగాలు సహా విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ కోల్ కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇదే సమయంలో అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ కూడా సుంకాల్ని తగ్గించే అంశం కూడా చర్చల్లో ఉంది. ఇదే సమయంలో అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కామర్స్ సెక్రటరీ అగర్వాల్ స్వాగతించారు. ఈ డీల్ దీర్ఘకాలం అమల్లో ఉండి, పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని తీసుకురావాలని భారత్ ఆశిస్తుందని ఆకాంక్షించారు.మరోవైపు 2026 మే నెలకు సంబంధించిన వాణిజ్య గణాంకాల్ని ప్రభుత్వం విడుదల చేసింది. మే నెలలో భారత ఎగుమతులు 18 శాతం పెరిగి 45.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 20.62 శాతం పెరిగి 73.41 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో వాణిజ్య లోటు 28.21 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎగుమతి, దిగుమతుల వ్యత్యాసాన్నే వాణిజ్య లోటుగా చెబుతారు. 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- మే కాలంలో మొత్తం ఎగుమతులు 88.91 బిలియన్ డాలర్లుగా ఉండగా వృద్ధి 16.09 శాతంగా నమోదైంది. ఇక మే నెలలో పశ్చిమాసియాకు ఎగుమతుల విలువ స్వల్పంగా తగ్గి 5.30 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంలో ఇది 5.38 బిలియన్ డాలర్లుగా ఉండేది. బంగారం దిగుమతులు ఏప్రిల్- మే సమయంలో ఏకంగా 60 శాతం పెరిగి విలువ 9.04 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

# అమెరికా, ఇరాన్ డీల్ ఎఫెక్ట్

భారీగా తగ్గిన చమురు ధరలు , దలాల్ స్ట్రీట్‌లో బుల్ జోష్

అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పంద ప్రకటనతో ప్రపంచ మార్కెట్లలో సానుకూల సంకేతాలు

రికార్డు స్థాయికి నిక్కీ- క్షీణించిన ముడి చమురు ధరలు



పశ్చిమాసియా సంక్షోభానికి తెరదించేలా అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందన్న ప్రకటన ప్రపంచ ఆర్థిక మార్కెట్లకు భారీ ఊరటను ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన శాంతి ఒప్పంద రూపకల్పనతో సోమవారం ఆసియా స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు రికార్డు స్థాయిలో పెరుగుదలను నమోదు చేశాయి. మరోవైపు ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి. అటు దేశీయ మార్కెట్ సూచీలు దూసుకెళ్తున్నాయి.ముడి చమురు ఫ్యూచర్స్ ధరలు 4.77 శాతం తగ్గి బ్యారెల్‌కు 80.83 డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధరలు కూడా దాదాపు 4 శాతం క్షీణించి బ్యారెల్‌కు 83.77 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. మరోవైపు అమెరికా క్రూడ్ ధరలు 4.3 శాతం పడిపోయి బ్యారెల్‌కు 81.23 డాలర్లకు చేరాయి. అయితే యుద్ధం కారణంగా గత మూడు నెలలుగా సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అంతరాయాల ప్రభావం పూర్తిగా తొలగిపోవడానికి కొంత సమయం పట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. చమురు, సహజవాయు సరఫరాలు సాధారణ స్థితికి చేరాయని షిప్పింగ్, బీమా సంస్థలు పూర్తిగా నమ్మిన తర్వాతే ధరలు స్థిరపడే అవకాశముందని అంచనా వేస్తున్నారు.సోమవారం సెన్సెక్స్ 1200 పాయింట్ల వరకు ఎగబాకింది. ఎర్లీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1069 పాయింట్లు లాభపడి, 76,597 కొనసాగుతోంది. నిఫ్టీ 327 పాయింట్లు పుంజుకొని, 23,950 వద్ద ట్రేడ్ అవుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడింది. ట్రేడింగ్ ప్రారంభంలో 94.68గా ఉంది. మే 8 తర్వాత ఇదే మెరుగైనస్థాయి కావడం గమనార్హం.నిఫ్టీ సూచీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, టీఎంపీవీ, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఓఎన్‌జీసీ, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్, అపోలో హాస్పిటల్స్, సన్ ఫార్మా షేర్లు నష్టాల్లో ఉన్నాయి.ఒప్పందం ప్రకటన అనంతరం ఆసియా ప్రధాన స్టాక్ మార్కెట్లు భారీగా ఎగిశాయి. జపాన్ నిక్కీ-225 సూచీ ప్రారంభ ట్రేడింగ్‌లో 5.1 శాతం లాభపడి 69,367 పాయింట్ల వద్ద కొనసాగింది. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతకు సంబంధించిన కంపెనీల షేర్లలో భారీ కొనుగోళ్లు కనిపించాయి. గత ఏడాదిలోనే నిక్కీ సూచీ 80 శాతానికి పైగా పెరగడం గమనార్హం.దక్షిణ కొరియా కోస్పీ ప్రాంతీయ మార్కెట్లలో అత్యధిక లాభాలను నమోదు చేసింది. కోస్పీ 5.6 శాతం ఎగిసి 8,577.62 పాయింట్లకు చేరుకుంది. ఆస్ట్రేలియాలో ఎస్అండ్‌పీ/ఏఎస్ఎక్స్ 200 సూచీ 1.4 శాతం పెరిగి 8,930 పాయింట్లకు చేరగా, తైవాన్ తైఎక్స్ సూచీ 2.6 శాతం లాభపడింది. యుద్ధం ముగింపుకు చేరువవుతోందన్న సంకేతాలతో పెట్టుబడిదారులు భారీగా కొనుగోళ్లకు మొగ్గుచూపినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.అమెరికా మార్కెట్లకు కూడా ఈ పరిణామాలు ఉత్సాహాన్నిచ్చాయి. ఎస్అండ్‌పీ 500 ఫ్యూచర్స్ 1 శాతం పెరగగా, డౌ జోన్స్ ఫ్యూచర్స్ 0.8 శాతం లాభపడ్డాయి. దీంతో వాల్ స్ట్రీట్‌లో కూడా ప్రారంభ ట్రేడింగ్ సానుకూలంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే శుక్రవారం ట్రేడింగ్‌లో అమెరికా మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.5 శాతం పెరిగి గత 11 వారాల్లో 10వ విజయవంతమైన వారాన్ని నమోదు చేసింది. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ అవరేజ్ 353 పాయింట్లు లేదా 0.7 శాతం పెరిగింది. నాస్‌డాక్ కంపోజిట్ సూచీ 0.3 శాతం లాభపడింది.ఇరాన్ ఒప్పందాన్ని ధ్రువీకరించినప్పటికీ అమలు ప్రక్రియ అధికారిక సంతకాల తర్వాతే ప్రారంభమవుతుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్ వెల్లడించిన వివరాల ప్రకారం శుక్రవారం స్విట్జర్లాండ్‌లో అధికారిక సంతకాల కార్యక్రమం జరగనుంది. అలాగే ఇరాన్ అణు కార్యక్రమం సహా పలు కీలక అంశాలపై రాబోయే 60 రోజుల పాటు విస్తృత చర్చలు కొనసాగనున్నాయి. గత మూడు నెలలకు పైగా కొనసాగిన యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. చమురు ధరల పెరుగుదల, సరఫరా గొలుసుల అంతరాయం, పెట్టుబడిదారుల ఆందోళనలతో మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ ఒప్పందం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక ఉపశమనం కలిగించే పరిణామంగా అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఒప్పందం పూర్తి అమలు, తదుపరి చర్చల ఫలితాలపై మార్కెట్ల దృష్టి ఇప్పుడు కేంద్రీకృతమైంది.



# మూలాలను మరిచిపోను

పబ్బుల్లో, నైట్ పార్టీల్లో ఎంజాయ్ చేయడానికి ఎక్కువగా ఆసక్తి చూపే సెలబ్రిటీలు చాలామంది ఉన్నారు. కానీ మంగళూరు భామ శ్రీనిధి శెట్టి అలాంటి వాటికి పూర్తి వ్యతిరేకం. క్లబ్‌లు, పబ్‌ల కన్నా, దేవాలయాల సందర్శనలోనే ఎక్కువ ఆనందం ఉంటుందని, ఖాళీ టైమ్‌లో ఈషా ఫౌండేషన్‌కి వెళ్లి మెడిటేషన్ చేయడంలో ఉన్నంత ఆనందం మరెక్కడా దొరకదని శ్రీనిధి అంటున్నది. ఇంకా ఆమె మాట్లాడుతూ 'నా తల్లిదండ్రులు క్రమశిక్షణతో నన్ను పెంచారు. బాగా చదివించారు. యాక్సెంచర్ వంటి పెద్ద కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నన్ను మోడలింగ్ సినిమాలవైపు తీసుకొచ్చింది. నేను ఈ రోజు ఎంతటి స్టార్‌ని అయినా కావచ్చు. కానీ మూలాలను మాత్రం మరిచిపోను. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సంస్కారాన్ని వదులు కోను' అంటూ చెప్పుకొచ్చింది శ్రీనిధి శెట్టి.



# కన్నీళ్లు పెట్టించే కథ

విజయ్ ఆంటోని, స్వాసిక జంటగా నటిస్తున్న చిత్రం 'వంద దేవుళ్లు'. రైతు నేపథ్య కథాంశమిది. శశి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రామాంజనేయులు జవ్వాజి నిర్మించారు. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు నిహారిక కొణిదెల, త్రినాథరావు నక్కిన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 'బిచ్చగాడు' సినిమాతో దర్శకుడు శశి తనకు కొత్త జీవితాన్నిచ్చాడని, ఆ సినిమా తరహాలోనే 'వందదేవుళ్లు' భావోద్వేగభరితంగా సాగుతుందని, ఈ కథ విని కన్నీళ్లను ఆపుకోలేకపోయానని విజయ్ ఆంటోని అన్నారు. 'బిచ్చగాడు' కంటే గొప్పగా చిత్రాన్ని తీశారని నిహారిక కొణిదెల ప్రశంసించింది. "తల్లీకొడుకుల కథ ఇది. 'బిచ్చగాడు' కథకు పూర్తి భిన్నంగా ఉంటుంది. హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయి. ప్రతీ ఒక్కరికి కనెక్ట్ అవుతుంది' అని దర్శకుడు శశి తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: బాలాజీ శ్రీరామ్, నిర్మాత: రామాంజనేయులు జవ్వాజి, దర్శకత్వం: శశి.

# రవితేజ పాంచ్ పటాకా

హిట్లు, ఫ్లాపుల గురించి పట్టించుకోకుండా వరుసపెట్టి సినిమాలు చేసుకుంటూ వెళ్తుంటారు అగ్ర హీరో రవితేజ. ఈ క్రమంలోనే 'ధమాకా' లాంటి భారీ విజయాలు ఆయన ఖాతాలో పడుతుంటాయి. నిజానికి 'ధమాకా' తర్వాత ఆయనకు సరైన విజయం లేదు. అయినా ఆయన డైరీ మాత్రం ఎప్పుడూ ఫుల్‌గానే ఉంటుంది. ప్రస్తుతం 'ఇరుముడి' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. తండ్రీ,కూతుళ్ల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందుతున్న ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకుడు. త్వరలోనే సినిమా విడుదల కానున్నది. దీని తర్వాత దిల్ రాజు సంస్థలో ఓ సినిమా చేయబోతున్నారు రవితేజ. ఓ కొత్త దర్శకుడు ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నాడట. ఇక దర్శకుడు వివేక్ ఆత్రేయ కూడా లైన్లోనే ఉన్నాడు. వీరిద్దరి కాంబినేషన్లో కూడా సినిమా ఉంటుందని తెలుస్తున్నది. ఇక రవితేజ కోసం తమిళ దర్శకుడు హరి ఓ కథ సిద్ధం చేశారట. మాస్ అంశాలతో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని టాక్ వినిపిస్తున్నది. దర్శకుడు మారుతీ సైతం ఇటీవలే రవితేజకు ఓ కథ వినిపించారట. మొత్తానికి రవితేజ లైనప్ మాత్రం చాలా స్ట్రాంగ్‌గానే ఉంది. అయితే.. వీటికి చెందిన అధికారిక ప్రకటనలు మాత్రం రావాల్సివుంది.



# 12 ఏండ్ల తర్వాత..

ప్రస్తుతం సినిమాలకంటే రాజకీయపరమైన కారణాలతోనే అగ్ర కథానాయిక త్రిష వార్తల్లో నిలుస్తున్నది. తమిళనాడు సీఎం విజయ్ సన్నిహితురాలిగా చలామణి అవుతూ అక్కడి రాజకీయ వర్గాల్లో కూడా ప్రత్యేకతను చాటుకుంటున్నది. ఇదిలావుండగా త్రిష నటించిన ఓ తమిళ సినిమా 12 ఏండ్ల తర్వాత విడుదలకు సిద్ధమవుతుండటం విశేషం. వివరాల్లోకి వెళితే.. అరవింద్‌స్వామితో త్రిష నటించిన 'శతురంగ వట్టై-2' 2014లో చిత్రీకరణ పూర్తిచేసుకుంది. అయితే ఆర్థిక సమస్యల కారణంగా సినిమా విడుదలకు నోచుకోలేదు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి ఆర్‌వీ నిర్మల్‌కుమార్ దర్శకుడు. హెచ్ వినోద్ కథనందించారు. త్రిష దక్షిణాదిలో అగ్ర కథానాయికగా దూసుపోతున్న రోజుల్లో చేసిన సినిమా కావడంతో ఇప్పటికీ ఆమె అభిమానులు రిలీజ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. ప్రస్తుతం తమిళనాట త్రిషకు ఉన్న ఫాలోయింగ్ దృష్ట్యా కమర్షియల్‌గా వర్కవుట్ అవుతుందని నిర్మాతలు ధీమాతో ఉన్నారట. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తారని సమాచారం.





# మీ అభిమానం వెలకట్టలేనిది

'మూడేళ్లయింది నేను సినిమాలు చేసి. అయినా మీ నుంచి అదే ప్రేమ. వెలకట్టలేని అభిమానం ఇది. సినిమా చాలా బాగా వచ్చింది. నిర్మాతకు ఎంత స్ట్రెస్ ఉంటుందో ఈ సినిమా ద్వారా తెలిసింది. నిద్రను కూడా దూరం చేసుకొని అంతా ఈ సినిమాకు పనిచేశారు. వారివల్లే ఈ పాత్రను సమర్థవంతంగా పోషించగలిగాను. టెక్నికల్‌గా అన్ని విధాలా సినిమా బావుంటుంది. ఇందులో అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయి. పాటలు బావుంటాయి. కచ్చితంగా ఈ బంగారం అందరికీ నచ్చుతుంది' అని అగ్ర నటి సమంత అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి నిర్మించిన యాక్షన్ ఫ్యామిలీ డ్రామా 'మా ఇంటి బంగారం'. నందినీరెడ్డి దర్శకత్వం వహించిన ఈచిత్రం ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో సమంత మాట్లాడారు. డైరెక్టర్ నందినీరెడ్డి మాట్లాడుతూ 'నా లైఫ్‌లో ఇంతకష్టపడ్డ సినిమా లేదు. టీమ్ వల్లే ఇంత త్వరగా సినిమా చేయగలిగాను. ఈ నెల 19న థియేటర్లలో సమంత విశ్వరూపం చూస్తారు' అని నమ్మకంగా చెప్పారు. ఇంకా సంగీత విధ్వాంసురాలు శోభారాజ్, డి.సురేశ్‌బాబు, రాజ్ నిడుమోరు, డీకే, దేవకట్టా, స్వప్నదత్, వై.రవిశంకర్, శ్రీముఖి, చిన్మయి, రాహుల్ రవీంద్రన్, శ్రీలక్ష్మిలతోపాటు చిత్రబృందమంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com